ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 14 మే 2024







పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకులు

చెలరేగిన వైసీపీ శ్రేణులు

◆ టీడీపీ నేతలే లక్ష్యంగా దాడులు

పోలింగ్ సరళితో బెంబేలెత్తిన వైసీపీ అభ్యర్థులు, నాయకులు అసహనంతో చెలరేగిపోయారు. పల్నాడు సహా, గుంటూరు, బాపట్ల జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో దాడులు, దౌర్జన్యాలతో చెలరేగిపోయారు. పల్నాడు జిల్లాలో అయితే ఓటర్లను భయభ్రాంతులకు గురి చేశారు. గుంటూరు నగర పరిధిలోని పలు బూత్‌ల వద్ద వైసీపీ శ్రేణులు దౌర్జన్యాలు చేశాయి. అసహనం, ఆందోళనతోనే పలు ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యాలు, దాడులకు దిగినట్లు తెలుస్తోంది.

దగ్గరుండి మంత్రి అంబటి రిగ్గింగ్

ముప్పాళ్ళ మండలం చాగంటివారిపాలెం పోలింగ్ బూత్‌లలో మంత్రి అంబటి రాంబాబు తన అనుచరులతో దగ్గరుండి మరీ రిగ్గింగ్ చేయించారు. అడ్డుకోబోయిన టీడీపీ శ్రేణులు, కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణపై వైసీపీ మూకలు రాళ్ల వర్షం కురిపించాయి. బూత్‌లోని వైసీపీ వారిని బయటకు తీసుకురావాలని రూరల్ సీఐ రాంబాబును కోరినా పట్టించుకోకపోవడంతో కన్నా అనుచరులు బూత్ లోపలికి వెళ్ళేందుకు ప్రయత్నించారు. దీంతో అంబటి అనుచరులు రాళ్ళు, కర్రలతో టీడీపీ శ్రేణులపై దాడిచేశారు. దీంతో ఓ బాలుడితో పాటు ఐదుగురు గాయపడగా బాధితులను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

ఇరువర్గాల దాడి.. సీఐకి గాయాలు

తాడికొండ మండలం నిడుముక్కలలో 83వ నెంబరు బూత్‌లో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత టీడీపీ వార్డు మెంబరు నాగ స్వరూపపై దాడి చేసి ఆమె జాకెట్ చించి, తాళిబొట్టును తెంపుకుని ఇంట్లోని వస్తువులను కూడా ధ్వంసం చేశారు. దీంతో టీడీపీ శ్రేణులు అక్కడకు చేరుకోగా ఇరువర్గాల మధ్య దాడులు జరిగాయి. రాళ్ల దాడిలో సీఐ ప్రభాకర్‌కి గాయాలైయ్యాయి. పోలీస్ బెటాలియన్ వచ్చి ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్న చేసినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. గుంటూరు అమరావతి రోడ్డుపై ఇరు వర్గాలు బైఠాయించి ఆందోళనకు దిగారు.



● దగ్ధమవుతున్న బహ్మారెడ్డి వాహనం



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం



పూర్తిగా దహనమైన ఎంపీ శ్రీకృష్ణదేవరాయల కారు



● అరవిందబాబు వాహనాన్ని ధ్వంసం చేసిన వైసీపీ మూకలు

ఓటెత్తారు..

- కేంద్రాల వద్ద జాతరను తలపించిన జనం
- ఉదయం నుంచి బూత్‌ల వద్ద ఓటర్ల బారులు
- ఈవీఎంల మొరాయింపు, ఆలస్యంగా ప్రారంభం
- పలు దగ్గర్ల కనీస సదుపాయాలు లేక అల్లాడిన జనం
- మధ్యాహ్నం వరకు మండిన ఎండ.. పలువురు ఇబ్బంది
- సాయంత్రానికి చల్లగా మారిన వాతావరణం, పలుచోట్ల వర్షం



రేపల్లె : ఇసుకపల్లిలోని అయోవా బాలికోన్నత పాఠశాల ఎన్నికల బూత్‌లో ఓటుహక్కువినియోగించుకునేందుకు బాలురుతీరిన ఓటర్లు

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్లు పోటెత్తారు.. మధ్యాహ్నం వరకు ఎండ మండింది.. ఓటమి భయంతో పోలింగ్ రోజూ వైసీపీ శ్రేణులు యథేచ్ఛగా దాడులకు తెగబడ్డాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రశాంతంగా జరిగే పోలింగ్ బూత్‌ల వద్ద ఈ సారి వీరంగం సృష్టించారు. వైసీపీ మూకలు ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా.. బూత్‌ల వద్ద ఓటింగ్‌లో జాప్యం జరిగినా.. భానుడు భగభగ మండినా.. ఓటర్లు వెనుతిరగలేదు. ఓటేసి కాని వెళ్లేది లేదన్నట్లుగా భీష్మించుకున్నారు. ఓటరు చైతన్యం వెల్లివెరిసిందా.. అన్నట్లుగా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. మరోవైపు ప్రచారాలపై నిషేధం ఉన్నా వైసీపీ అభ్యర్థులు పలు దగ్గర్ల పట్టించుకోకుండా తమకు ఓటేయ్యాలంటూ, బూత్‌ల వద్ద టీడీపీ శ్రేణులు అల్లర్లు చేస్తున్నాయంటూ.. ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్‌తో పోలింగ్ రోజంతా హోరెత్తించారు. ఇతర రాష్ట్రాలే కాదు.. విదేశాల నుంచి వచ్చిన ఓటర్లు కూడా గంటల తరబడి నిరీక్షించి మరీ ఓటేశారు. 7 గంటలకు పోలింగ్ ప్రారంభ సమయం కాగా అంతకంటే ముందే వచ్చి ఓటర్లు బూత్‌ల వద్ద బారులు తీరారు. యువత, మహిళలు క్యూల్లో బారులు తీరారు. గేట్లు బయటే గుంపులు, గుంపులుగా ఉదయం ఆరు గంటల నుంచే పడిగాపులు కాశారు. భగభగమండే సూర్యుడు మధ్యాహ్నానికి శాంతించి చల్లబడడంతో ఓటర్లు సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో బూత్‌ల వద్దకు చేరుకున్నారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నా చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అర్ధరాత్రి 12 గంటల వరకు కూడా పలు కేంద్రాల్లో పోలింగ్ జరుగుతూనే ఉంది.

వెల్లివెరిసిన చైతన్యం.. విదేశాల నుంచి రాక

ఓటేయడానికి బారులు తీరినవారిలో యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఓటేయడానికి విదేశాల నుంచి కూడాపెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. కువైట్, ఐర్లాండ్, న్యూజిలాండ్, అమెరికా తదితర దేశాల నుంచి కూడా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. గడచిన రెండు వారాలుగా భగభగమండుతున్న సూర్యుడు ఓటర్ల ఉత్సాహాన్ని చూసి సోమవారం తన ప్రచండాన్ని అంతగా చూపలేదు. పైగా మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పలు నియోజకవర్గాల్లో వర్షం కురిసింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని కొన్ని నియోజకవర్గాలతో పాటు బాపట్ల, వేమూరు పరిధిలో వాతావరణం చల్లబడింది. దీంతో సాయంత్రం వేళ ఓటర్లు మరింత ఉత్సాహంగా వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లకు బూత్‌ల వద్ద సదుపాయాలు కల్పించడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. తాగునీటి సౌకర్యం కల్పించక పోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. చాలాదగ్గర్ల ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

స్ట్రాంగ్‌రూంల్లో ఓటరు తీర్పు భద్రం

ఓటరు తీర్పు ఆదివారం రాత్రి నుంచి స్ట్రాంగ్‌రూంలకు చేరుకుంటున్నది. పోలింగ్ ముగిసిన కేంద్రాల నుంచి ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్లకు తీసుకొచ్చారు. పోలింగ్ ఆలస్యమైన ప్రదేశాల నుంచి ఈవీఎంలు అర్ధరాత్రి తర్వాత వచ్చాయి. గుంటూరు లోక్‌సభకు సంబంధించి నాగార్జున యూనివర్సిటీ, బాపట్ల, నరసరావుపేట కేంద్రాల్లోని రిసెప్షన్ కేంద్రాల వద్ద రద్దీ ఏర్పడింది. జిల్లా ఉన్నతాధికారులు రిసెప్షన్ సెంటర్లలో ఉండి ఈవీఎంలు భద్రంగా స్ట్రాంగ్‌రూంల్లోకి వెళ్లేంత వరకు మొత్తం ప్రక్రియని పర్యవేక్షిస్తున్నారు. అన్ని పోలింగ్ బూత్‌ల సామాగ్రి చేరుకున్న తర్వాత రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీళ్ల వేస్తారు.

బాపట్లలో.. మొరాయించిన ఈవీఎంలు

బాపట్ల జిల్లాలో 82.33 శాతం నమోదైనట్లు సోమవారం అర్ధరాత్రి అధికారులు ప్రకటించారు. రాత్రి 8 గంటల వరకు కూడా కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నారు. బాపట్ల మున్సిపల్ హై స్కూల్‌లోని మోడల్ పోలింగ్ బూత్‌లో కూడా పోలింగ్ ఆలస్యంగానే ప్రారంభమైంది. బాపట్లలోని టౌన్ హాలు 81 నెంబరు పోలింగ్ బూత్‌లో తొలి ఓటు పడగానే ఈవీఎంలు మొరాయించాయి. ఇమ్మడిశెట్టిపాలెం, చీరాల, మార్టూరు మండలం ద్రోణాదుల లోని పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్‌బూత్‌లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి రంజిత్ బాషా తొలి ఓటు వేశారు. ఎండవేడిమి తాళలేక జమ్ములపాలెంలోని పోలింగ్‌బూత్‌లో నర్రాసుబ్రహ్మణ్యం అనే వ్యక్తి గుండెపోటుకు గురికాగా వైద్య సిబ్బంది ప్రాథమికి చికిత్స చేశారు.

వైసీపీ దాడులు.. పట్టించుకోని పోలీసులు

బాపట్ల జిల్లా పరిధిలో పోలింగ్ బూత్‌ల వద్ద ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేసే వారే కరువయ్యారు. రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌పై వైసీపీ శ్రేణులు దాడికి యత్నం చేయబోయారు. చీరాల టీడీపీ అభ్యర్థి ఎంఎం.కొండయ్యపై కర్రలతో దాడికి ప్రయత్నించారు. కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెంలో మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యం చేయబోగా ఆయన కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మార్టూరు మండలం కోనంకిలో టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. సినీ నిర్మాత, రచయిత కోన వెంకట్ అనుచరులను వెంటేసుకుని కర్లపాలెం మండలంలోని పోలింగ్ బూత్‌ల వద్ద హంగామా సృష్టించారు. కొల్లూరులో వైసీపీ అభ్యర్థి అశోక్‌బాబు రెచ్చగొట్టేలా వ్యవహరించడంతో టీడీపీ శ్రేణులు గట్టిగా స్పందించాయి. బాపట్ల పరిధిలోని చిలగొల్ల పాలెం పోలింగ్ బూత్ వద్ద వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగాయి. కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెం, బాపట్ల మండలం పూండ్లలో పాలకపార్టీ శ్రేణులు అరాచకం సృష్టించాయి. అల్లూరులో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. తూర్పు పిన్నిబోయినవారిపాలెంలోని 117 బూత్‌లో పోలింగ్ సిబ్బందిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యానికి తెగబడ్డాయి. తహసీల్దార్ కారుపై కూడా రాళ్లతో దాడి చేశారు. పోలింగ్ సందర్భంగా వైసీపీ శ్రేణులు ఆ యా కేంద్రాల దగ్గర దాడులకు తెగబడినా వారిని అడ్డుకునే పోలీసులే కరువయ్యారు. పర్చూరు, అద్దంకి, వేమూరులో భారీ వర్షంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు.



తెనాలిలో వర్షం నీటిలో ఓటువేసేందుకు నిలబడిన ప్రజలు

కాసును తరిమిన ఓటర్లు

గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిని నడికుడి ఓటర్లు పరుగులు పెట్టించారు. ఎన్నికల ప్రక్రియ పరిశీలించే పేరట అక్రమాలకు ప్రయత్నించిన ఆయన్ను ఓటర్లు ప్రశ్నించారు. తమనే ప్రశ్నిస్తారా అని ఆయన అనుచరులు దాడులకు ప్రయత్నించి, మహిళలను బూతులు తిట్టారు. దాంతో పోలింగ్ బూత్ లో ఉన్న ఓటర్లు ఎమ్మెల్యే కాసుకి ఎదురు తిరిగారు. మా ఊరు వచ్చి మామీదే దౌర్జన్యం చేస్తారా అనడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటికి వచ్చినట్లు బూతులు మాట్లాడారు. దీంతో అక్కడున్న ఓటర్లు రాళ్ళు తీసుకుని వెంట పడటంతో కాసు అక్కడి నుంచి పరుగులు పెట్టారు.

- మాచర్లలో ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు రెచ్చిపోయారు. మాచర్ల పట్టణంలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి టీడీపీ కార్యకర్తలను కారుతో తొక్కించారు. ఈ సంఘటనలో ఐదుగురు టీడీపీ కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ తర్వాత ఓ టీడీపీ నేత ఇంటిని దగ్గరుండి ధ్వంసం చేయించారు. రెంటచింతల మండలం రెంటాలలో గుంటూరు రేంజ్ ఐజీ ఎదుటే జూలకంటి బ్రహ్మారెడ్డిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి కళ్లలో కారం కొట్టి హత్యాయత్నానికి ఒడిగట్టారు. అనంతరం రెండు కార్లను ధ్వంసం చేసి ఓ కారును తగలబెట్టారు.
- దాచేపల్లిలో టీడీపీ కార్యకర్తలపై కర్రలతో దాడి చేసి వైసీపీ వర్గాలు గాయపరిచాయి. తంగెడలో బాంబులతో వైసీపీ వర్గాలు దాడులకు దిగాయి. ఎరికేపల్లిలో టీడీపీ కార్యకర్త వాహనాన్ని ధ్వంసం చేశారు.
- నరసరావుపేట మండలం దొండపాడులో వైసీపీ శ్రేణులు ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడి చేశాయి. ఆయన కాన్వాయ్‌లోని రెండు కార్లను ధ్వంసం చేశారు. పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ అభ్యర్థి అరవిందబాబుపై ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి అనుచరులు ఎమ్మెల్యే సమక్షంలోనే దాడి చేశారు. అరవిందబాబు కారుతో పాటు పలు కార్లను ధ్వంసం చేశారు. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. గోపిరెడ్డి ఆస్పత్రి, టీడీపీ కార్యాలయంపై ఇరు పక్షాలకు దాడులు చేసుకున్నాయి. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. పరిస్థితిని అదుపుతోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బరు తుటాలను ప్రయోగించారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరు వర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. చిలకలూరిపేట నుంచి వస్తున్న శ్రీకృష్ణ దేవరాయల కాన్వాయ్‌ను అడ్డుకున్న వైసీపీ శ్రేణులు ఓ కారులోని వారిని కిందకు దించి పెట్రోల్ పోసి తగలబెట్టారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు.
- సత్తెనపల్లి నియోజకవర్గం తొండపి, రూపెనగుంట్ల, చీమలమర్రి, కుంకలగుంట, గుళ్లపల్లి గ్రామాల్లో రాళ్ల కర్రలతో టీడీపీ శ్రేణులపై వైసీపీ మూకలు దాడులు చేశాయి. ఈ సంఘటనలలో పలువురు కార్యకర్తలు గాయ పడ్డారు. క్రోసూరు మండలం ఎర్రబాలెం, దొడ్లేరు గ్రామాల్లో పరస్పర దాడులు జరిగాయి.



మాచర్లలో వైసీపీ కార్యకర్తల వీరంగం



టీడీపీ కార్యకర్తలపై రాళ్లు రువ్వుతున్న వైసీపీ కార్యకర్తలు



అద్దంకి భవానీ సెంటర్ కేంద్రంలో ఓటు వేసిన గొట్టిపాటి



గుంటూరులో ఆనందబాబు దంపతులు





బాపట్ల, పొన్నూరులో వేగేశన, అనగాని



పిడుగురాళ్లలో యరపతినేని దంపతులు



వినుకొండలో జీవీ ఆంజనేయులు దంపతులు





సత్తెనపల్లిలో కన్నా, పొన్నూరులో నరేంద్ర





మాచర్లలో బ్రహ్మారెడ్డి, తెనాలిలో మనోహర్













గుంటూరులో లావు, పెదకూరపాడులో ప్రవీణ్, నరసరావుపేట అరవిందబాబు, బుర్రిపాలెంలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని, గుంటూరు తూర్పులో నసీర్, మంగళగిరిలో లోకేశ్



బాపట్ల ఇంజనీరింగ్ కాలేజికి ఈవీఎంలతో సిబ్బంది

దిక్సూచి

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ఏటా ప్రపంచవ్యాప్తంగా పది బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలోకి విడుదలవుతున్నాయని అంచనా. దానిలో 30 శాతం అంటే మూడు బిలియన్ టన్నుల కార్బన్ ఉద్గారాలనే మహాసముద్రాలు శోషించుకుంటాయి. అందువల్ల సముద్ర పర్యావరణాన్ని అతిపెద్ద కార్బన్ సింక్‌గా చెప్పుకుంటాం. భూ వాతావరణాన్ని రక్షిస్తున్న సముద్ర పర్యావరణానికి చేపలవేట, సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం వంటి మానవ కార్యకలాపాలు తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయి.



మహా సముద్రాల్లో జీవవైవిధ్య పరిరక్షణ

హై సీస్ ప్రాంతం అంటే సముద్ర తీర దేశాల ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్ పరిధి(తీరం నుంచి 200 నాటికల్ మైళ్లు)ని దాటి విస్తరించిన 'జాతీయ పరిధుల వెలుపలి సముద్ర ప్రాంతం'. దీని సంరక్షణకు సరైన అంతర్జాతీయ చట్టాలు అమలులో లేవు. భూగోళంలో దాదాపు సగం విస్తీర్ణంలో ఉన్న హైసీస్(జాతీయ పరిధుల వెలుపలి సముద్రం ప్రాంతం)లో కేవలం 1.44% మాత్రమే పరిరక్షిస్తున్నారని యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ సీస్(యూఎన్‌సీఎల్‌ఓఎస్) నివేదిక తెలుపుతోంది. అంటే 99 శాతం హైసీస్ ప్రాంతం ఎటువంటి పరిరక్షణకు నోచుకోవడం లేదు.

వాతావరణ మార్పులను సమర్థవంతంగా ఎదుర్కొని సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే భూగోళంలో సగభాగంగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, అక్కడి సముద్రాంతర్గత పర్యావరణాన్ని రక్షించాల్సిన ఆవశ్యకత ఉంది. అదీ కాక సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 14వది అయిన 'లైఫ్ బిలో వాటర్' అనే ప్రత్యేక లక్ష్యం, సముద్రాంతర్గత పర్యావరణ రక్షణకు సంబంధించి ప్రత్యేకంగా తీర్మానించింది. కాబట్టి సముద్రాంతర్గత పర్యావరణ పరిరక్షణకు ఒక అంతర్జాతీయ ఒడంబడిక అవసరం ఏర్పడింది. ఈ దిశగా చర్యలు చేపట్టడానికి 2022 డిసెంబరులో కెనడాలోని మాంట్రియెల్ నగరంలో కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్(సీఓపీ)-15లో 'కున్‌మింగ్ - మాంట్రియెల్ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్ వర్క్'ను ఆమోదించారు. 2030 నాటికల్లా భూమి, సముద్ర పర్యావరణ ప్రాంతంలో 30 శాతాన్ని పరిరక్షించాలని ఈ ఫ్రేమ్‌వర్క్ నిర్దేశిస్తుంది. దీనినే '30x30 వ్యూహం'అని కూడా అంటారు. ఈ వ్యూహం అమలు కోసం అన్ని సముద్రతీర దేశాల మద్దతు కూడగట్టడానికి 'యునైటెడ్ నేషన్స్ కన్వెన్షన్ ఆన్ ద లా ఆఫ్ ద సీ' ప్రాధికారిత 'ట్రీటీ ఆఫ్ హైసీస్/బయోలాజికల్ డైవర్సిటీ ఇన్ ఏరియాస్ బియాండ్ నేషనల్ జ్యూరిస్‌డిక్షన్(బీబీఎన్‌జే) ట్రీటీ'ని 2023 మార్చిలో ప్రవేశపెట్టారు. ఈ ఒప్పందంపై అంగీకార సంతకాలు చేయడానికి తీర దేశాలన్నింటికీ 2023 సెప్టెంబరు 20 నుంచి 2025 సెప్టెంబరు 20 వరకు గడువు నిర్దేశించారు. కనీసం 60 దేశాలు ఈ ఒప్పందంపై సంతకం చేసి, దానిని ర్యాటిఫై చేసినప్పుడే ఇది అమలులోకి వస్తుంది. అంటే సంతకాలు చేసిన దేశాలు, తమ దేశంలోని సంవిధానాలకు అనుగుణంగా ఆ ఒప్పందానికి చట్టపరమైన ధృవీకరణను ప్రకటించాల్సి ఉంటుంది.(ఉదాహరణకు పార్లమెంటు ఆమోదం). ఈవిధంగా 88 దేశాలు ఇంతవరకూ బీబీఎన్‌జే ఒప్పందంపై సంతకాలు చేశాయి. రెండు దేశాలు(చిలీ, పలావూ) మాత్రమే ర్యాటిఫై(చట్టపర ధృవీకరణ) చేశాయి. భారత్ సహా మిగతా 86 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. గడువు కాలం సమీపిస్తుండటంతో సంతకాలు చేసిన దేశాలను ర్యాటిఫై చేసే దిశగా ప్రోత్సహించడానికి 2024 మార్చి 7న బెల్జియంలో 'ద బ్లూ లీడర్స్ హై-లెవల్ ఈవెంట్ ఆన్ బయోడైవర్సిటీ బియాండ్ నేషనల్ జూరిస్‌డిక్షన్' సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీబీఎన్‌జే ఒప్పందాన్ని 2025లో జరగనున్న 'ద యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్' వేదికగా అమలులోకి తేవడానికి కృషిచేయాలని పిలుపునిచ్చింది.

బీబీఎన్‌జే ద్వారా ఆశిస్తున్న రంగాల వారీ ప్రయోజనాలు

1. ఆర్థిక ప్రయోజనాలు: దేశ తీరప్రాంతాల్లో మత్స్య సంపద వృద్ధి, సముద్ర ఆధారిత ఉద్యోగ, ఆదాయ కల్పన పెంపు, నిజమైన సుస్థిర నీలి ఆర్థికవ్యవస్థ సాధన.
2. సామాజిక ప్రయోజనాలు: భావితరాల సంక్షేమాన్ని పెంపొందించడం, అంతర్జాతీయ సముద్ర సమానత్వ సూత్రాలను ఆచరణలోకి తేవడం, సముద్ర వనరుల నుంచి అత్యధిక ప్రయోజనాలు పొందేవిధంగా అధ్యయన, నిర్వహణపరమైన కౌశలాల పెంపు.
3. దౌత్యపర ప్రయోజనాలు: దేశాల మధ్య బహుపాక్షిక సహకారం, పరిపాలనాపరమైన సహాయ సహకారాలను బలపర్చడం, అంతర్జాతీయ నిర్ణయాధికారాల పెంపొందింపు, సముద్ర వాతావరణ పునరుద్ధరణ.

బీబీఎన్‌జే ఒప్పందానికి ఎదురవుతున్న సమస్యలు

1. 30 శాతం ప్రపంచ సముద్ర ప్రాంతాన్ని 2030 వరకు పరిరక్షించాలన్న ధ్యేయం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ ఒప్పందం అమలుకు నోచుకోవాలంటే కనీసం 60 దేశాలు ర్యాటిఫై చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకూ రెండు దేశాలే ర్యాటిఫై చేశాయి. వచ్చే ఏడాది సెప్టెంబరు 20 నాటికల్లా మిగతా 58 దేశాలు ర్యాటిఫై చేయడం సందేహాస్పదమే. ఒకవేళ ర్యాటిఫై చేసినప్పటికీ మరో అయిదేళ్లలో 30 శాతం సముద్ర ప్రాంతాన్ని పరిరక్షించడానికి యుద్ధప్రాతిపదిక చర్యలు అవసరం. ఇంకా నిధుల వితరణ, వ్యవస్థల నిర్మాణం, చట్టం అమలు వ్యవస్థల పరంగా ఒక కొలిక్కిరాని నిర్ణయాలు ఏమేరకు లక్ష్యసాధనకు దారిచూపగలవన్నది సందేహాస్పదం.
2. పర్యావరణ ప్రభావ అంచనాలు హైసీస్ ప్రాంతాల్లో చేయడం సాంకేతికంగా చాలా క్లిష్టమైన అంశం. పలు టెక్నిక్స్ పరంగా కూడా ఇంకా శాస్త్రీయ, సాంకేతిక అధ్యయనాలు జరగాల్సి ఉంది. ఈ అధ్యయనాలకు భారీస్థాయిలో నిధుల కేటాయింపు కూడా అవసరం.
3. అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య సముద్ర జీవవనరుల పంపిణీని ఏవిధంగా చేయాలనే అంశం అత్యంత క్లిష్టమైనది, చాకచక్యంగా నిర్వహించాల్సిన అంశం.

ఇన్ని సవాళ్లు ఉన్న నేపథ్యంలో, మరో ఏడాదిన్నర కాలంలో బీబీఎన్‌జే ఒప్పందం పట్టాలెక్కడం కష్టసాధ్యమైనప్పటికీ, సుతారమూ సాధించి తీరాల్సిన ఆవశ్యకత ప్రపంచ తీర దేశాలకు ఉంది. ఎందుకంటే, వాతావరణ మార్పుల వల్ల తలెత్తే విపత్తులను ఎక్కువగా ఎదుర్కొనేవి ఆ దేశాలే కాబట్టి. తమ తీర ప్రాంతాలు మునిగిపోకూడదన్నా, తుపానులు రాకుండా ఉండాలన్నా, మత్స్యసంపద తరిగిపోకూడదన్నా భూమిపై అత్యధిక విస్తీర్ణంలో కార్బన్ సింక్ రూపంలో ఆవరించి ఉన్న సముద్ర పర్యావరణాన్ని పరిరక్షించుకోకతప్పదు. దీనికి బీబీఎన్‌జే ఒప్పందం ఒక చక్కని చుక్కానిగా ఉపయోగపడుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

బీబీఎన్‌జే ఒప్పందం-లక్ష్యాలు

1. మొత్తం సముద్ర భాగంలో మూడింట రెండువంతులుగా ఉన్న హైసీస్ ప్రాంతాన్ని, ప్రస్తుతం ఉన్న అత్యల్ప రక్షితస్థాయి(1.44 శాతం) నుంచి మరింత ఎక్కువ రక్షిత స్థాయికి పెంచడం. తద్వారా సముద్ర ఆవరణ వ్యవస్థను పరిరక్షించడం.
2. హైసీస్ ప్రాంతంలో ఉన్న మెరైన్ జెనెటిక్ రిసోర్సెస్(సముద్రాంతర్గత జీవ వనరులు - సముద్రపు జీవులు, నాచు, మొక్కలు మొదలైన వాటిని) అన్ని దేశాల మధ్య న్యాయబద్ధంగా, సమంగా పంపిణీ చేసి అన్ని దేశాలకు సమానంగా ఆర్థిక లబ్ధి చేకూర్చడం.
3. సముద్రాంతర్గత ఖనిజోద్ధహణం(డీప్ సీ మైనింగ్) వంటి సముద్ర ఆవరణ వ్యవస్థలకు హాని కలిగించే మానవ చర్యలకు అనుమతించే ముందు వివిధ దేశాలు పర్యావరణ ప్రభావాలను సమర్థవంతంగా అంచనా వేసే మార్గదర్శకాలను రూపొందించడం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

ఐఐఎఫ్‌టీ

ఆన్‌లైన్‌లో ఎంబీఏ(ఐబీ)



న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ) - ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్) ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి ఆన్‌లైన్ విధానంలో ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: ఈ ప్రోగ్రామ్‌ను వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఉద్దేశించారు. దీని వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొదటి ఏడాది మేనేజ్‌మెంట్ స్ట్రాటజీ, ట్రేడ్ అండ్ ఫైనాన్స్, మార్కెటింగ్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ఆర్గనైజేషనల్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిసోర్సెస్ కోర్సులు చదవాల్సి ఉంటుంది. రెండో ఏడాది ఫైనాన్స్, ట్రేడ్, మార్కెటింగ్, స్ట్రాటజీ, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎకనామిక్స్ స్పెషలైజేషన్‌లలో ఒకదాన్ని ఎంచుకోవాలి. ప్రోగ్రామ్‌లో భాగంగా వర్చువల్ సెషన్స్ ఉంటాయి. పారిశ్రామిక నిపుణులు గెస్ట్ లెక్చర్స్ ఇస్తారు. కేస్ స్టడీస్, ప్రాబ్లం సాల్వింగ్ విధానాలపై బృంద చర్చలు ఉంటాయి. వారాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్ సెషన్స్ నిర్వహిస్తారు.

అర్హత: కనీసం 55 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయోపరిమితి నిబంధనలు లేవు. కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం తప్పనిసరి. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

ఐహెచ్‌ఎంలో డిప్లొమా

హాజీపూర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం)- డిప్లొమా ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు వైవా, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాదిన్నర. దేశవ్యాప్తంగా ఉన్న స్టార్ హోటళ్లలో ఏడాది పాటు ఇంటెన్సివ్ ట్రెయినింగ్, ఆర్నెల్లపాటు ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ ఉంటాయి.

విభాగాలు-సీట్లు: ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ విభాగాలు ఉన్నాయి. ఒక్కోదానిలో 56 సీట్లు ఉన్నాయి. ప్రతి విభాగంలో జనరల్ అభ్యర్థులకు 26, ఓబీసీలకు 15, ఎస్సీలకు 8, ఎస్టీలకు 4, ఈడబ్ల్యూఎస్ వర్గానికి 3 సీట్లు ప్రత్యేకించారు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు(స్టేట్/సెంట్రల్) నుంచి ఏదేని గ్రూపుతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

వెబ్‌సైట్: ihmhajipur.net

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/PRJDZZDలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి





క్యూలో నిల్చుని ఓటేసిన సినీ ప్రముఖులు

సోమవారం హైదరాబాద్‌లో లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో సినీ ప్రముఖులు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. సాధారణ జనంతో పాటు ఉదయం ఏడు గంటలకే పోలింగ్ బూత్‌కు వెళ్లి క్యూ లైన్లలో నిలబడి, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. మెగాస్టార్ చిరంజీవి, మోహన్‌బాబు, జూనియర్ ఎన్టీఆర్, మహేశ్ బాబు, అల్లు అర్జున్, రామ్‌చరణ్, కల్యాణ్‌రామ్, డాక్టర్ రాజశేఖర్, నాని, నాగచైతన్య, విజయ్ దేవరకొండ.. ఒకరనేమిటి అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'మీరు కూడా ఓటు వేయండం'టూ పిలుపునిచ్చారు.







మాతృభాషలోనూ డబ్బింగ్

దక్షిణాది అభిమానులే కాక ఉత్తరాది ప్రేక్షకలోకం కూడా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమా 'కల్కి 2898 ఏ.డీ'. ఇందులో ప్రభాస్‌కు జోడీగా దీపికా పదుకొనే కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే. జూన్ 27న ఈ చిత్రం విడుదల కానుండడంతో చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసింది. ఇటీవలే ఈ మూవీలో తన పాత్ర కోసం దీపికా డబ్బింగ్ మొదలుపెట్టారు. ఆ పాత్ర డబ్బింగ్‌ను హిందీలోనే కాకుండా తన మాతృభాష అయిన కన్నడలోనూ దీపికానే స్వయంగా చెప్పుకోవడం విశేషం. తన మాతృభాషలో డబ్బింగ్‌కు దీపికానే వాయిస్ అందించడంతో ఇది మూవీకి మరింత ప్లస్ కానుంది అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, ఈ సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్‌కు నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దిశా పటానీలతో కూడిన భారీ తారాగణం ఇందులో నటిస్తున్నారు. అశ్వినీదత్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.





కేన్స్ చిత్రోత్సవంలో టీజర్ లాంచ్

మంచు విష్ణు నటిస్తున్న ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ 'కన్నప్ప'. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు తారస్థాయిలో ఉన్నాయి. ఇందుకు తగ్గట్లే ఈ సినిమాకు సంబంధించిన ప్రతీ విషయంలో చిత్ర బృందం పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో విడుదల చేయబోతున్నారు. 'వరల్డ్ ఆఫ్ కన్నప్ప' పేరుతో రిలీజ్ కానున్న ఈ టీజర్ ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతిని అందిస్తుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. కాగా, ఈ భారీ బడ్జెట్ ఫ్యాంటసీ డ్రామాను ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కిస్తున్నారు. మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్, మోహన్‌బాబు, శరత్‌కుమార్, శివ రాజ్‌కుమార్, అక్షయ్‌కుమార్, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి స్టార్స్ కీలక పాత్రల్లో మెరవనున్నారు.

నటిస్తూ వేదికపై కుప్పకూలిన నటుడు



జీవితంలో చివరి క్షణం వరకూ నటిస్తూ ఉండాలని చాలా మంది చెబుతుంటారు. అది మరాఠి నటుడు సతీశ్ జోషి విషయంలో నిజమైంది. ఆదివారం ఆయన ముంబైలో రంగోత్సవ్ కార్యక్రమంలో ప్రదర్శన ఇస్తూ ఉన్నట్లుండి వేదికపై కుప్పకూలారు. 'ఉదయం నుంచి సతీశ్ అలసటతో కనిపించారు. వేదికపై కార్యక్రమం ప్రారంభమైన కొద్ది సేపటికే ఆయన కింద పడిపోయారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది.' అని సతీశ్ సన్నిహిత మిత్రుడు, సహ నటుడు రాజేశ్ దేశ్‌పాండే చెప్పారు. మరాఠి నాటకాలు, టీవీ సీరియల్స్, సినిమాల ద్వారా సతీశ్ చిరపరిచితుడు. ఆయన మరణంతో ఓ ప్రతిభాశాలిని మరాఠి చిత్ర పరిశ్రమ కోల్పోయిందని చెప్పాలి.

పోలింగ్ రోజున వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. రాళ్లు, కర్రలు, పెట్రోలు బాంబులతో తెగబడ్డాయి. పల్నాడు వ్యాప్తంగా భయాందోళనలు సృష్టించాయి. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల కార్లను ధ్వంసం చేశాయి. కొన్ని వాహనాలకు నిప్పు పెట్టాయి. వైసీపీ దుశ్చర్యల్లో పదుల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తెనాలిలో స్థానిక ఎమ్మెల్యే ఏకంగా ఓటరు చెంప పగలగొట్టడం.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఓటమి భయంతోనే ఇటువంటి దాడులకు పాల్పడ్డారని టీడీపీ ఆరోపిస్తోంది.

వైసీపీ మూకల.. అరాచకం

- ఎన్నికల సందర్భంగా పల్నాడులో బరితెగింపు
- కూటమి అభ్యర్థులే లక్ష్యంగా దాడులు
- కార్లు ధ్వంసం..
- గ్రామాల్లో అల్లర్లు.. టీడీపీ శ్రేణులపై దాడులు
- బాపట్ల జిల్లాలోనూ వైసీపీ దౌర్జన్యకాండ

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

● రెండు కార్లు ధ్వంసం.. ఒక కారు దగ్ధం



వైసీపీ మూకలు ధ్వంసం చేసిన బ్రహ్మారెడ్డి వాహనం



దగ్ధమవుతున్న బ్రహ్మారెడ్డి స్కార్పియో కారు

రెంటచింతల, మే 13: మండలంలోని రెంటాల గ్రామంలో ఉదయం 6 గంటల 20 నిమిషాలకే టీడీపీకి చెందిన ఏజెంట్లతో సహా ఇతరులను వైసీపీ వర్గీయులు పురవీధుల్లో తన్నుకుంటూ దుర్భాషలాడారు. కర్రలు కొడవళ్లతో దాడి చేయడంతో టీడీపీకి చెందిన ఆరుగురు గాయపడ్డారు. వారిలో చేరెడ్డి మంజుల, చేరెడ్డి గోపాలరెడ్డిలకు బాగా గాయాలయ్యాయి. వీరిని గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బ్రహ్మారెడ్డి గురజాల వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి రెంటాలకు వచ్చి గంట ఇరవై నిమిషాలు అక్కడే ఉన్నారు. ఆ తరువాత టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్ రానీయకుండా వైసీపీ గూండాలు కర్రలతో హల్‌చల్ చేశారు. బ్రహ్మారెడ్డి 11.40గంటలకు గ్రామంలోకి మళ్లీ వచ్చారు. 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌ల దగ్గరకు వచ్చి విజయవాడ ఎస్పీ సుప్రజకు జరిగిన పరిణామాలను వివరిస్తున్న సమయంలో మహిళలు బ్రహ్మారెడ్డిని ఏకవచనంతో సంబోధించడంతో పాటు కారం చల్లారు. బ్రహ్మారెడ్డి వంగడతో ఆ కారమంతా భుజాల మీద పడింది. వెనుక ఉన్న పాత్రికేయుల కళ్లు కారంతో నిండిపోయాయి. మహిళలంటే గౌరవం లేదా.. ఇదేమి సంస్కృతి.. కనీసం మమ్ములను వెళ్లనీయకుండా అడ్డుకుంటారేందని విజయవాడ ఎస్పీ సుప్రజ ఆగ్రహంతో ప్రశ్నించారు. కొద్ది నిమిషాల వ్యవధిలో పార్కింగ్ చేసిన వాహనాలను ధ్వంసం చేశారు. ఒక స్కార్పియో వాహనాన్ని దొర్లించారు. బోర్లా పడేసిన వాహనానికి వైసీపీ మూకలు నిప్పు పెట్టారు. ఇక్కడ జరుగుతున్న సంఘటనలను జిల్లా ఎస్పీ బిందూ మాధవ్‌కు తెలిపారు. అలాగే ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి కూడా రెంటాలకు చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నం

గ్రామంలోకి వచ్చిన బ్రహ్మారెడ్డిపై దాడికి యత్నించారు. కొంత మంది యువకులు కర్రలతో హల్‌చల్ చేశారు. అసలు బ్రహ్మారెడ్డిని ఊళ్లోకి రానీయకుండా చూడాలనేది వైసీపీ వ్యూహం. కానీ రెండు సార్లు రావడంతో వారు జీర్ణించుకోలేకపోయారు. ఊరి చివరన కర్రలతో దాడులు చేయడానికి ఉపక్రమించగా పోలీసులు తరిమికొట్టారు.





ఎమ్మెల్యే సోదరుడు, అతని గ్యాంగు చేసిన దాడిలో గాయపడిన టీడీపీ నేతలు

బీభత్సం సృష్టించిన ఎమ్మెల్యే సోదరుడు

● 50 బైకులు, 10 కార్లతో పట్టణంలో హల్‌చల్

మాచర్లటౌన్, మే 13: స్థానిక ఎమ్మెల్యే, వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజున పట్టణంలో బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీలోని పోలింగ్ బూత్‌లో అధికసంఖ్యలో ఓట్లు పోలవడం, ఇవి టీడీపీ సానుభూతిపరులవి కావడంతో ఆగ్రహించిన వెంకట్రామిరెడ్డి తన గ్యాంగ్‌తో సుమారు 50 బైకులు, 10 కార్లతో అక్కడకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న టీడీపీ నేతల వాహనాలపై కార్లను ఎక్కించారు. అంతటితో ఆగక టీడీపీ నేతలను ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో ఆదూరి అలైఖ్య, ఫిరోజ్, షాజిద్, మల్లెల గోపి (డీజే)లకు తీవ్ర గాయాలయ్యాయి. అలాగే టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటిపై దాడి చేశారు. ఇల్లు, కారును ధ్వంసం చేశారు. ఇంట్లోని ఫర్నీచర్, సామాన్లు ఇంటి నుంచి బయటకు లాగి ధ్వంసం చేశారు. సుమారు 50 మంది టీడీపీ నేతల గృహాల్లోకి దూరి బీభ్సతం సృష్టించారు. గంటపాటు ఆ ప్రాంతమంతా అలజడి సృష్టించారు.

రెచ్చిపోయిన వైసీపీ మూకలు



వెల్దుర్తి మండలం గొట్టిపాళ్లలో దగ్ధమవుతున్న జనసేన నేత వాహనం

వెల్దుర్తి, మే 13: మండలంలో సోమవారం పోలింగ్ సందర్భంగా వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అలజడులు సృష్టించారు. టీడీపీ శ్రేణులు ధీటుగా ఎదుర్కొన్నారు. లోయపల్లిలో పోలింగ్ ప్రారంభమైన గంటలోనే టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడ్డారు. టీడీపీకి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. గొట్టిపాళ్లలో టీడీపీ నేతల గృహాలపై రాళ్లు, సీసా బాటిళ్లు విసిరి భయభ్రాంతులకు గురి చేశారు. టీడీపీ కార్యకర్త రాజబోయిన శ్రీహరికి గాయాలయ్యాయి. జనసేన కార్యకర్త మాదాసు నాగరాజుకు చెందిన బొలేరోకు వైసీపీ మూకలు నిప్పంటించి దగ్ధం చేశాయి. కొత్తపుల్లారెడ్డిగూడెంలోని 118వ బూత్‌లో టీడీపీ ఏజెంట్లు రేఖానాయక్, హనుమంతునాయక్‌లపై దాడి చేశారు. రేఖానాయక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అడ్డుకున్న హెడ్ కానిస్టేబుల్ వెంకయ్యకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి పోలింగ్ సరళిని పరిశీలించేందుకు బూత్‌లోకి వెళ్లగా వైసీపీ మూకలు అతనిపై దాడి చేసి గాయపరిచారు. ఆయన కారును కూడా ధ్వంసం చేశారు. పట్లవీడులో దొంగ ఓట్లు వేస్తున్న వైసీపీ కార్యకర్తను టీడీపీ నేతలు గుర్తించి ప్రశ్నించారు. మీరెవరు ప్రశ్నించడానికి అంటూ వైసీపీ నేతలు దాడులకు దిగారు. మరసపెంటకు చెందిన టీడీపీ నేత రెడ్యానాయక్ కారుపై వైసీపీ నేతలు రాళ్ల దాడి చేసి ధ్వంసం చేశారు. ఇదే గ్రామంలో పోలింగ్ విధులు నిర్వహిస్తున్న పుల్లారెడ్డి వాహనాన్ని వైసీపీ నేతలు ధ్వంసం చేశారు. కండ్లకుంటలోని 120 బూత్‌లో విద్యుత్ సరఫరాలో అంతరాయంకు కారణమైన లైన్‌మ్యాన్‌ను రామాంజినేయులును విధుల నుంచి తొలగించాలని జిల్లా ఎన్నికల అధికారి లోతేటి శివశంకర్ ఆదేశించారు.





తంగెడలో వైసీపీ నేతలు విసిరిన పెట్రోలు బాంబులకు మండుతున్న మంటలు

వైసీపీ మూకల దాడిలో గాయపడిన సురేష్, శ్రీనులను పరామర్శిస్తున్న ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ నేతల దుశ్చర్య

● జానపాడు, కరాలపాడులో వైసీపీ నేతల వీరంగం

పిడుగురాళ్ల, మే 13: మండలంలోని జానపాడులో టీడీపీ కార్యకర్తలైన వున్నం సురేష్, వున్నం శ్రీనులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటంతో తలకు గాయాలవగా పిడుగురాళ్ల ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వీరిని ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. అదేవిధంగా కరాలపాడు గ్రామంలోనూ పోలింగ్ ముగిసే సమయంలో వైసీపీ నేతలు కర్రలతో బీభత్సం సృష్టించి క్యూ లైన్‌లో వున్న ఓటర్లను భయాందోళనకు గురిచేశారు. టీడీపీ కార్యకర్తలపై విచక్షణా రహితంగా ఎగబడ్డారు. అడ్డొచ్చిన పోలీసుపై కూడా చేయి చేసుకున్నట్లు సమాచారం. తంగెడ గ్రామంలో వైసీపీ నేతలు పెట్రోలు బాంబులతో, రాళ్లతో వీరంగం సృష్టించారు. పెట్రోలు బాంబులు విసురుతూ గ్రామస్తులను, టీడీపీ శ్రేణులను భయాందోళనకు గురిచేశారు.

అనగానిపై దాడికి యత్నం

రేపల్లె, మే 13: రేపల్లె పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో ఉదయం నుంచే వైసీపీ నాయకులు బూత్‌లో హల్‌చల్ చేశారు. టీడీపీ బూత్ ఏజంట్లపై దాడికి యత్నించారు. సాయంత్రం 4గంటల సమయంలో పట్టణంలోని బూత్‌లలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఓపెన్ థియేటర్ బూత్‌లోకి పరిశీలించేందుకు వెళ్లారు. వైసీపీ మూకలు ఎమ్మెల్యే అనగానిపై ఇష్టమొచ్చినట్లుగా మాట్లాడి 20 రోజుల్లో తల తీసుకుని వెళ్తానంటూ మీదకు వచ్చారు. వైసీపీ నాయకుడ్ని ఒక దెబ్బ వెయ్యగా పక్కన ఉన్న టీడీపీ, వైసీపీ నాయకులు తోపులాట జరిగింది. సమీపంలో ఉన్న పోలీసులు ఇరువురికి సర్దిచెప్పి పంపారు. వైసీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఫిర్యాదు చేశారు.

టీడీపీ శ్రేణులపై వైసీపీ దాడులు..



వైసీపీ దాడిలో గాయ పడ్డ జనసేన నేత రాడ్ల శ్రీను, తొండపికి చెందిన టీడీపీ కార్యకర్త

సత్తెనపల్లి, మే13: ముప్పాళ్ళ మండలం తొండపి గ్రామంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు బిగ్గినేని చిన వెంకట్రామయ్య, రాయిడి రామారావు, రాయిడి బాపయ్య, షేక్ ఖాజావలి, నల్లబోతు శ్రీను, చల్లా పిచ్చయ్యలపై వైసీపీ కార్యకర్తలు రాళ్ళు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. రాజుపాలెం మండలం బలిజేపల్లిలో ఓటు వేసేందుకు వెళ్తున్న టీడీపీ నేత పల్లపాటి రాములుపై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. తలకు గాయం కావటంతో అతనిని వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి మండలంలోని ఫణిదంలోని రామచంద్రాపురం పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వెళ్ళిన టీడీపీ కార్యకర్తలు కోరంపల్లి సునీత, వడ్డెరపు లీలావతిపై వైసీపీ కార్యకర్తలు దాడి చేసి గాయపరిచారు. ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడులో పాగోలు బాజీ అనే ఓటరుపై ఎస్ఐ లాఠీతో దాడి చేయటంతో అతని కాలి వెముక విరిగింది. సత్తెనపల్లి పట్టణం 23వ వార్డుకు చెందిన జనసేన నేత వల్లె శ్రీనివాసరావు, జనసేన కార్యకర్త చౌదరి అనిఇల్ పై కూడా వారి ఇంటి వద్దనే రాడ్లతో తలపై తీవ్రంగా దాడి చేశారు. ముప్పాళ్ళ మండలం మాదలలో కూడా పోలింగ్ కేంద్రం టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు దాడి చేశారు.

అంబటి అల్లుడిపై తిరుగుబాటు

సత్తెనపల్లి, మే 13: మంత్రి అంబటి రాంబాబు అల్లుడు ఉమేష్ చౌదరి ముప్పాళ్ళ మండలం నార్నెపాడు గ్రామంలో సోమవారం హల్‌చల్ చేశారు. గ్రామానికి వెళ్ళి పోలింగ్ బూత్ వద్ద ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులను, కార్యకర్తలను నా కొ..., ఎవర్రా మీరు, ఇక్కడ మీ పోజులు ఏంటని? దౌర్జన్యం చేయబోయారు. ఉమేష్ కారులో నుంచి కర్రలు, రాడ్లను వైసీపీ నాయకులు బయటకు తీసి టీడీపీ కార్యకర్తలపై దాడి చేసేందుకు ప్రయత్నించగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరగబడ్డారు. మంత్రి అంబటి అల్లుడిని గ్రామంలో నుంచి తరిమి వేశారు.

లావు శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ మూకల దాడి

దొండపాడు(నరసరావుపేట రూరల్), మే 13: పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం దొండపాడు గ్రామంలో ఉమ్మడి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు పోలింగ్‌బూత్‌ను పరిశీలించేందుకు వెళ్ళడంతో గ్రామానికి చెందిన వైసీపీ మూకలు లావు శ్రీకృష్ణదేవరాయలుపై దాడికి పాల్పడ్డారు. లావు శ్రీకృష్ణ దేవరాయలుకు చెందిన మూడు కార్లను రాళ్ళు కర్రలతో దాడి చేసి వాహనాలను ధ్వంసం చేశారు.



దొండపాడులో టీడీపీ ఉమ్మడి అభ్యర్థి శ్రీకృష్ణదేవరాయలుపై వైసీపీ గూండాల దాడిలో దెబ్బతిన్న కార్లు

అట్టుడికిన నరసరావుపేట

- రబ్బరు తుటాలు ప్రయోగించిన పోలీసులు
- పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత
- ఇరువర్గాల కార్లు ధ్వంసం
- ఎంపీ లావు కాన్వాయ్‌లోని కారును దహనం చేసిన వైసీపీ మూకలు



వైసీపీ మూకలు దహనం చేస్తున్న ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని కారు

నరసరావుపేట, మే13: నరసరావుపేట పట్టణంలో వైసీపీ మూకలు దాడికి తెగబడ్డాయి. టీడీపీ అభ్యర్థి అరవింద బాబుతో పాటు పలువురు నేతల కార్లను ధ్వంసం చేశాయి. ఈ దాడులకు ప్రతిగా టీడీపీ శ్రేణులు కూడా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ఇంటి వద్ద ఉన్న కార్లను ధ్వంసం చేశాయి. ఇరువర్గాల దాడుల పరంపరతో పట్టణంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితి అదుపులోకి తెచ్చేందుకు పోలీసులు రబ్బలు తుటాలను ప్రయోగించారు. ఇరువర్గాలు నేతల కార్యాలయాల వద్ద పెద్ద ఎత్తున మోహరించాయి. వైసీపీ కార్యకర్తలు టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు కాన్వాయ్‌లోని ఒక కారును దహనం చేశాయి.

పట్టణంలో సాయంత్రం మూడు గంటల సమయంలో మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో దొంగ ఓటు వేస్తున్న వారిని టీడీపీ అభ్యర్థి ఏజెంట్లు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇరువర్గాలకు స్వల్ప ఘర్షణ జరిగింది. దీంతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తన అనుచరులతో స్కూల్ వద్దకు వచ్చాడు. అటుగా వస్తున్న టీడీపీ అభ్యర్థి అరవిందబాబు కారుపై గోపిరెడ్డి అనుచరుడు రాయితో కారును ధ్వంసం చేశాడు. ఈ కాన్వాయ్‌లోని పలు కార్లను కూడా గోపిరెడ్డి అనుచరులు ధ్వంసం చేశారు. అరవిందబాబుపై దాడికి ప్రతి దాడికి టీడీపీ శ్రేణులు పాల్పడ్డాయి. గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఉన్న కార్లను ధ్వసం చేశాయి. ఆస్పత్రి కిటికి అద్దాలను రాళ్లు రువ్వి పగలు గొట్టాయి. దాడి సమాచారం తెలుసుకున్న గోపిరెడ్డి తన అనుచరులతో తన ఆస్పత్రి వద్దకు వచ్చారు. ఈ దాడికి ప్రతిగా టీడీపీ కార్యాలయంపై దాడికి పూనుకున్నారు. గుంటూరు రోడ్డులో రాళ్ల వర్షం కురిపించుకున్నారు. వీరిని చెదరగొట్టేందుకు పోలీసులు తొలుత లాఠీ చార్జ్ చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో రబ్బరు తుటాలను ప్రయోగించి పరిస్థితిని అదుపు చేశారు. అటు అరవిందబాబు, ఇటు గోపిరెడ్డి ఆస్పత్రి వద్ద ఇరువర్గాలు రాత్రి 9 గంటల వరకు మోహరించే ఉన్నాయి. ఈ సందర్భంలో చిలకలూరిపేట నుంచి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణ కాన్వాయ్ ఆ ప్రాంతం గుండా వస్తోంది. కాన్వాయ్‌లో చివరి కారును వైసీపీ కార్యకర్తలు అడ్డుకొని కారుపై దాడి చేశారు. కారులో వారు కిందకు దింపి కారుపై ఇంధనం పోసి తగులబెట్టారు. రెండు వైపులా పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. అరవిందబాబు, గోపిరెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. పట్టణంలో పరిస్థితులు పోలీసుల అదుపులోకి రాలేదు. పట్టణంలో దాడులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో పోలీసుల విఫలమయ్యారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

ఓటరుపై దాడి హేయం

- దాడిని ఖండించిన పెమ్మసాని, నాదెండ్ల, ఆలపాటి
- గుంటూరు ఆసుపత్రిలో పరామర్శించిన పెమ్మసాని, రాజకుమారి



గుంటూరు జిల్లా సమగ్ర వైద్యశాలలో సుధాకర్‌ను దాడి జరిగిన వివరాలు అడిగి తెలుసుకుంటున్న పెమ్మసాని

తెనాలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఓటరుపై చేయిచేసుకుని చెంపపై కొడితే, అంతే వేగంగా ఓటర్ కూడా ఎమ్మెల్యే చెంప చెళ్లుమనిపించాడు. ఇంతలోనే ఎమ్మెల్యే శివకుమార్ అనుచరులు మూకుమ్మడిగా అతనిపైపడి విచక్షణా రహితంగా దాడిచేశారు. తెనాలి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐతానగర్ ఎర్రబడిలో సోమవారం జరిగిన ఈ ఘటనలో బాధితుడు సుధాకర్ గుంటూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. ఆయనను టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తెనాలి ఎమ్మెల్యే నియోజకవర్గ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, తదితరులు పరామర్శించారు. అతని మేమంతా అండగ ఉంటామని ధైర్యం చెప్పారు.

ఘటన గురించి బాధితుడు, ఓటరు సుధాకర్ ఇలా వివరించారు.. బాధ్యతగా ఉండాల్సిన ఎమ్మెల్యే తాను చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు నేను మద్యం మత్తులో ఉన్నానని, అసభ్యంగా మట్లాడానని, ఎవరినో కులం పేరుతో దూషించానని, నిందలు వేయటం సరికాదు. మద్యం సేవించానని నిరూపిస్తే ఏ శిక్షకైనా నేను సిద్ధమే. ప్రస్తుతం ఆసుపత్రిలోనే ఉన్నాను కనుక నా రక్తం తీసుకుని పరీక్షించుకోవాలని, మద్యం సేవించినట్టు నిర్ధారణ అయితే నాకేసు వెనక్కు తీసుకుని, నాపై చర్యలు తీసుకోవాలని నేనే కోరతానన్నారు.

పోలింగ్ శాతం తగ్గించే కుట్ర...

ఓటర్లపై ఎమ్మెల్యే స్థాయి వ్యక్తే చేయిచేసుకోవటం, వారి అనుచరులు దాడులు చేయటం ప్రజాస్వామ్యంలో మంచిదికాదని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. చెంప దెబ్బతో మీరు ఓటరును బెదిరించాలని చూస్తే, మీకు అంతే వేగంగా దాని పర్యవసానం కనిపిస్తుంది. భయపెట్టి పోలింగ్ జరగకుండా చూద్దామనే ప్రయత్నాలను అధికార పార్టీ మానుకోవాలని అన్నారు.

మీ ప్రవర్తన చూసి జనమే మీ చెంపపై తిప్పికొట్టారు..

ప్రజాస్వామ్యంలో ఓటరే దేవుడు. అటువంటి దేవుడిని జాగ్రత్తగా చూసుకోవలసిందిపోయి దాడిచేస్తారా? ఐతానగర్‌లో సుధాకర్‌పై జరిగిన దాడిని జనసేన, టీడీపీ, బీజేపీ తరఫున ఖండిస్తున్నాం. అని తెనాలి అసెంబ్లీ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. సుధాకర్‌పై దాడిచేసిన వారంతా అటువంటి చరిత్ర ఉన్నవారని తెలిసి పోలింగ్ స్టేషన్ లోపలకు పోలీసులు ఎట్లా అనుమతిస్తారంటూ మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఓటర్‌ని కొడితే ఓట్లు పడతాయా..?

ఇంకెంత కాలం దాడులు చేస్తారు? ఇంకెంతకాలం పాలన సాగుతుందనుకుంటున్నారంటూ మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. సుధాకర్‌పై దాడిని ఖండించారు. ఓటర్‌ను కొడితే ఓట్లు ఎట్లాపడతాయనుకుంటున్నారో నాకు అర్థం కావటంలేదని, ఎంతో అనుభవం ఉందని చెప్పే అధికార పార్టీ నేతలు ఆ చిన్న లాజిక్ ఎన్నికల వేళ ఎట్లా మర్చిపోయారో అర్థం కావటం లేదన్నారు. ప్రజల తీర్పు వారి విముక్తిని కోరుకుంటోందని ఆయన అన్నారు.

వైసీపీ దౌర్జన్య కాండ



నిబంధనలకు విరుద్ధంగా పేరలి పోలింగ్‌బూత్‌లోకి అనుచరులతో కలిసి వెళ్లిన కోన వెంకట్

బాపట్ల, మే 13(ఆంధ్రజ్యోతి): బాపట్ల నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా ఘర్షణలు చోటు చేసుకున్నాయి. చీరాల మండలం గవినివారిపాలెంలో వైసీపీ శ్రేణుల దాడిలో టీడీపీ కార్యకర్తకు గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి ఎంఎం కొండయ్య గ్రామానికి చేరుకుని పోలీసుతో మాట్లాడుతున్న సమయంలో ఒక్కసారిగా వైసీపీ రౌడీ మూకలు ఆయనపైకి దూసుకొచ్చారు. ఈ క్రమంలో ఆయన కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కర్రలు, రాడ్లు పెట్టుకుని వైసీపీ శ్రేణులు అరాచకం సృష్టించి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారు.

కోన వెంకట్ అనుచరులను వెంటేసుకుని...

కర్లపాలెం మండలం లోని పోలింగ్ బూత్‌ల వద్ద కోన వెంకట్ తన అనుచరులను వెంటేసుకుని హంగామా సృష్టించారు. ప్రశ్నించిన టీడీపీ శ్రేణులపై దాడికి వైసీపీ మూకలు తెగబడ్డాయి. దళితులపై దాడి చేసి మళ్లీ ఎందుకు వచ్చావని కర్లపాలెం మండలంలోని పేరలి బూత్ వద్ద దళిత యువకులు ప్రశ్నించారు. వెంటనే వైసీపీ మూకలు దాడి చేయడంతో దళితులైన ప్రేమచంద్, పవన్‌లకు గాయాలయ్యాయి.

ఏట్రావారిపాలెంలో..

కర్లపాలెం మండలం ఏట్రావారిపాలెం బూత్‌లో ఓటింగ్ సరళిని పరిశీలించడానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధన్‌రెడ్డిపై వైసీపీ శ్రేణులు దాడి చేయబోయాయి. పెద్దఎత్తున టీడీపీ కార్యకర్తలు ప్రతిఘటించారు. పరస్పర ఘర్షణలలో వైసీపీ కార్యకర్తలు ఇద్దరికి గాయలయ్యాయి. కొల్లూరులో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు రెచ్చగొట్టే విధంగా వ్యవహరించడంతో టీడీపీ శ్రేణులు గట్టిగా స్పందించాయి. రేపల్లెలోని ఓ పోలింగ్ బూత్‌ను సందర్శించడానికి వెళ్లిన టీడీపీ అభ్యర్థి అనగాని సత్యప్రసాద్‌పై వైసీపీ కార్యకర్తలు దాడికి ప్రయత్నించారు. రాంబొట్లపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో వైసీపీ శ్రేణులు దాడి చేయడంతో టీడీపీ కార్యకర్తకు తల పగిలింది.

టీడీపీ నాయకులపై రాళ్లవర్షం



దాచేపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరామర్శిస్తున్న యరపతినేని



కేశానుపల్లిలో వైసీపీ నేతల దాడిలో గాయపడిన రామకోటయ్యను పరామర్శిస్తున్న ఎంఎల్‌సీ జంగా

దాచేపల్లి, మే 13: ఎన్నికల నేపథ్యంలో సోమవారం కేశానుపల్లి గ్రామంలో వైసీపీ నేతలు టీడీపీ నాయకులైన నెల్లూరి రామకోటయ్యను దుర్భాషలాడుతూ దాడిచేసి తల పై కొట్టారు. ఈ ఘటనలో నెల్లూరి రామకోటయ్య తలకు బలంగా గాయమై తీవ్ర రక్తస్రావం జరిగింది. దీంతో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. సమాచారం అందడంతో ఏం జరుగుతుందో తెలుసుకుందామని ఇరికేపల్లి గ్రామానికి నడి కూడికి చెందిన టీడీపీ నాయకులు ద్విచక్ర వాహనాలలో తరలివెళ్లారు. ఇదే అదునుగా భావించి వైసీపీ నేతలు రాళ్ల వర్షం కురిపించారు. ఈ ఘటనతో టీడీపీ నేతలు ద్విచక్ర వాహనాలను అక్కడే వదిలేసి పరుగులు తీశారు.

ఇదిలావుండగా దాచేపల్లిలో దొంగఓట్లకు పాల్పడుతున్నారంటూ టీడీపీ నేతలు వాదనకు దిగడంతో వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు టీడీపీ కార్యకర్త కనిశెట్టి రవీంద్రను రాయితో తలపై మోదడంతో తలకు గాయమైంది. ఇదే సమయానికి కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు పాఠశాలకు చేరుకొని గాయపడిన కనిశెట్టి రవీంద్రను పరా మర్శించి ధైర్యం చెప్పారు. తంగెడ గ్రామంలో ఒక్క ఓటు విషయంలో ఏర్పడిన చిన్నవివాదం చిలికిచిలికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడం, నాటుబాంబు లు వేసుకోవడం, పెట్రోలు బాంబులతో దాడులుచేయడంతో యుద్ధ వాతావరణం ఏర్పడింది. రెండు ద్విచక్రవాహనాలు కూడా దగ్ధమైనట్లు సమాచారం. కేశానుపల్లి గ్రామానికి చెం దిన టీడీపీ నేత నెల్లూరి రామకోటయ్యపై వైసీపీ నాయకు లు దాడిచేసి గాయపరిచారని సమాచారం అందుకున్న ఎం ఎల్‌సీ జంగా కృష్ణమూర్తి అక్కడికి చేరుకొని రామకోటయ్య ను జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. నడికూడి గ్రామంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కాన్వాయ్‌పై కూడా కొంత మంది వ్యక్తులు రాళ్లు విసిరినట్లు సమాచారం. దీంతో వైసీపీ నేతలంతా నడికూడి చేరుకోవడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం ఏర్పడిం ది. దాచేపల్లిలో వైసీపీ, టీడీపీ నేతల మధ్య తోపులాట జరిగింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

పోలింగ్ సరళిని పరిశీలించిన అభ్యర్థులు


బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన

బాపట్ల,మే 13 : నియోజకవర్గంలోని బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం, మండలాలలో పోలింగ్ సరళిని అభ్యర్థులు పరిశీలించారు. సోమవారం ఉద యం నుంచి సాయంత్రం వరకు ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ వేసేవిధానం, మొరాయించిన ఈవీఎంలు, ఓటర్లకు కల్పించిన వసతులు గురించి పరిశీలించి ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అదేవిధంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు, అధికారులు

సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ నాయకులు, పోటీలో ఉన్న అభ్యర్థులతోపాటు అధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ సూర్యలంకరోడ్డులోని సరస్వతీ మెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. అదేవిధంగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును 9వ వార్డు చిల్లరగొల్లపాలెం బూత్‌లో ఓటు వేశారు. శాసనమండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు బాపట్ల మండలం కొండుభొట్లపాలెం గ్రామంలో, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో, ఎస్పీ వకుల్ జిందాల్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లో ఓటు వేశారు. తెలుగుదేశంపార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు తాతా జయప్రకాష్ నారాయణ, మానం విజేతలు నందిరాజుతోట, కంకటపాలెం గ్రామాలలో, మాజీ ఎమ్మెల్సీ అన్నంసతీష్ ప్రభాకర్ పట్టణంలోని ఆంజనేయ అగ్రహారం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జెడి.శీలం, ఎమ్మెల్యే అభ్యర్థి గంటా అంజిబాబు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.




ఓటు హక్కు వినియోగించుకున్నట్లు వేలు చూపుతున్న ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఎస్పీ వకుల్ జిందాల్, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

● ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలం


జంపని పోలింగ్ కేంద్రంలో ఉదయం 7.30గంటలకే క్యూలైన్లలో బారులు తీరిన మహిళా ఓటర్లు

వేమూరు, మే 13 : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సోమవారం ప్రశాంతంగా పూర్తయింది. ఉదయం ఐదున్నర గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించాల్సి ఉండగా పార్టీల ఏజెంట్లు ఆలస్యంగా రావడంతో పోలింగ్ కేంద్రాలు ఈ ప్రక్రియ ఉదయం 7 గంటలకు పూర్తయింది. కొన్ని చోట్ల 7.30గంటలకు పోలింగ్ ప్రారంభించారు. చావలి, వేమూరు పోలింగ్ కేంద్రాల్లో మూడు బూతుల్లోని ఈవీఎంలు మొరాయించడంతో ఆ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ ఉదయం ఎనిమిది గంటల తర్వాత ప్రారంభమైంది. కొన్ని గ్రామాల్లో ఒకేసారి ఓటర్లు కేంద్రాల్లోకి రావడంతో తొక్కిసలాట జరిగింది. చుండూరు, భట్టిప్రోలు మండలాల్లో మధ్యాహ్నం రెండు గంటలకు భారీ వర్షం అరగంటకు పైగా కురవడంతో పలు గ్రామాల్లో పోలింగ్ అంతరాయం ఏర్పడింది. కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగటం వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొల్లూరులో కూటమి శ్రేణులు, వైసీపీ అభ్యర్థి మధ్య తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పలు గ్రామాల్లో ఇరు పార్టీల శ్రేణుల మధ్య చిన్న చిన్న ఘర్షణలు చెలరేగాయి. కొన్ని కేంద్రాల వద్ద అధిక సంఖ్యలో ఓటర్లు ఒకేసారి రావడంతో అదే సమయంలో ఎంత తీవ్రత వల్ల ఏర్పాటు చేసిన షామ్యానాలు చాలక ఎండలోనే గంటల తరబడి నిలబడి ఓటు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూటమి అభ్యర్థి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించుకున్నారు. రాత్రి 10.30 గంటల సమయానికి 84.73 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు.

భట్టిప్రోలు మండలంలో..

భట్టిప్రోలు, మే 13: మండలంలో పోలింగ్ ప్రారంభ సమయంలో సగానికి పైగా కేంద్రాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యం త్రాలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యం అయినప్పటికి సజావుగానే ముగిశాయి. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు అరకొరగా కల్పించడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా ఓటర్లు తోసుకోవడంతో గొరిగపూడి గ్రామంలో ఓ యువతి సొమ్మసిల్లి పడిపోవడంతో వైద్యసిబ్బంది చికిత్స చేశారు. మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య తన స్వగ్రామమైన పెసర్లంక గ్రామంలోని జడ్పీ హైస్కూల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు భట్టిప్రోలులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మునిలక్ష్మి గ్రామాల్లో పర్యటిస్తూ ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు. చెదురుమదురు ఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు 200 మందిపై బైండోవర్ నమోదు చేశారు. స్థానిక సిబ్బంది ప్ర త్యేక బలగాలు 100మందితో బందోబస్తు పటిష్టంగా నిర్వహించారు.

ఎండా.. వానను సైతం లెక్క చేయని ఓటర్లు


దోనేపూడి పోలింగ్ బూత్‌లో ఓటింగ్ ప్రక్రియ గురించి ఏజెంట్లను అడిగి తెలుసుకుంటున్న కూటమి అభ్యర్థి ఆనందబాబు

కొల్లూరు, మే 13 : మండలంలో సోమవారం ఉదయం 7 గంటలకు ఎన్నికల సిబ్బంది పోలింగ్ ప్రక్రియను ప్రారంభించారు. కొన్నిచోట్ల ఈవీ ఎంలు మొరాయించడంతో కొద్దిసేపు పోలింగ్ ఆలస్యమైంది. కొల్లూరు లో 6గంటలకే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈపూరు, కొల్లూరు, ఈపూరులంక, చింతల్లంక, పోతార్లంక, తిప్పలకట్ట, కోటిపల్లి తదితర గ్రామాల్లో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వివాదాలు, తోపులాటలు జరిగాయి. దీంతో ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నత్తనడకన కొనసాగింది. ఓటు వేసేందుకు మహిళ లు, వృద్ధులు, యువత ఉత్సాహం కనబరిచారు. ఎండా.. వానను సైతం లెక్క చేయకుండా గంటల కొద్ది క్యూలైన్లలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ రాత్రి 9 గంటలకు పైగా కొనసాగింది.

టీడీపీ నాయకులపై వైసీపీ అభ్యర్థి దౌర్జన్యం

కొల్లూరు జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో జరుగుతు న్న పోలింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చిన వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు పోలింగ్ కేంద్రం ఎదురుగా ఉన్న పెట్రోల్ బంకులో జనం ఉండటంతో పెట్రోల్ బంకులోకి వెళ్లి మీరంతా ఇక్కడ ఉండకూడదంటూ పెట్రోల్ బంకు మూసివేయాలని దౌర్జన్యానికి దిగారు. దీంతో టీడీపీ కార్యకర్తలకు, ఆయనకు వాగ్వివాదం జరిగింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి అశోక్‌బాబును అక్కడ నుంచి పంపివేశారు. తన వాహనం వద్దకు వెళ్లి టీడీపీ నాయకులు ఘైనేని మురళీకృష్ణకు వేలు చూపించి కవ్వింపు చర్యలకు పాల్పడటంతో గమనించిన టీడీపీ కార్యకర్తలు కారుపై రాయి, చెప్పులు విసిరారు. దీంతో ఆయన వాహనం స్వల్పంగా దెబ్బతింది.

పలు చోట్ల యథేచ్ఛగా ఘర్షణలు..

బాపట్ల, మే13(ఆంధ్రజ్యోతి): బాపట్లలోని చిలగొల్లపాలెం పోలింగ్ బూత్ వద్ద వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగాయి. కర్లపాలెం మండలం కొత్తనందాయపాలెంలో పాలకపార్టీ శ్రేణులు అరాచకం సృష్టించాయి. బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం అల్లూరులోని 200 పోలింగ్‌బూత్‌లో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ జరిగింది. బాపట్ల మండలంలోని తూర్పు పిన్నిబోయిన వారిపాలెంలో 117వ పోలింగ్‌బూత్‌లో పోలింగ్ సిబ్బందిపై వైసీపీ శ్రేణులు దౌర్జన్యానికి తెగబడ్డారు. తహసీల్దార్ అక్కడకు చేరుకోగా ఆయన కారుపై కూడా రాళ్లతో వైసీపీ శ్రేణులు దాడి చేశాయి. బాపట్ల ఆర్వో శ్రీధర్ అదనపు పోలీసు బలగాలతో అక్కడకు చేరుకున్నాక వైసీపీ మూకలు తోకముడిచాయి. బాపట్ల మండలం లోని పూండ్లలో వైసీపీ కార్యకర్తలు కర్రలతో టీడీపీ మద్దతుదారులపై దాడికి తెగబడ్డారు.

పోటెత్తిన ఓటరు

● ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
● పలు చోట్ల ఈవీఎంల మొరాయింపు, ఆలస్యంగా ప్రారంభం
● కేంద్రాల వద్ద జాతరను తలపించిన జనం
● విదేశాల నుంచి వచ్చి ఓటు హక్కు వినియోగం
● కనీస సదుపాయాలు లేక అల్లాడిన జనం
● ఎండ దెబ్బకు పలువురికి అస్వస్థత
● సాయంత్రానికి చల్లగా మారిన వాతావరణం, పలు చోట్ల వర్షం


గంటల తరబడి నిలబడి ఉన్నామంటూ పోలింగ్, పోలీసుసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఓటర్లు

బాపట్ల, మే13(ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూ ఈ స్థాయిలో ఓటరు చైతన్యం వెల్లివెరిసి ఉండదేమో అన్న చందాన ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఉదయం నుంచే బారులు తీరారు. మహిళలు, వృద్ధులు, యువత పెద్ద సంఖ్యలో ఓట్లెయ్యడానికి పోటెత్తారు. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ చాలా చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట ఆలస్యంగా ప్రారంభమైంది. అమెరికా, కువైట్, న్యూజిలాండ్, ఐర్లాండ్ నుంచి కూ డా వచ్చి మరీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రోజు భగ భగ మండే సూర్యుడు మధ్యాహ్నానికి శాంతించి చల్లబడడంతో ఓటర్లు సాయంత్రం వేళ పెద్ద సంఖ్యలో వచ్చారు. పర్చూరు, అద్దంకి, వేమూరులో భారీ వర్షం పడేసరికి ఓటేయడానికి వచ్చిన ప్రజలు అవస్థలు పడ్డారు. మొత్తంగా పోలింగ్ సరళిని చూస్తే గతంలో ఎన్నడూలేని విధంగా ఓటర్లు పోటెత్తి తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు

పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు...

బాపట్లలోని టౌన్ హాలులో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లోని 81 పోలింగ్‌బూత్‌లో ఉదయం తొలి ఓటు పడగానే ఈవీఎంలు మొరాయించడంతో దాదాపు 20 నిమిషాల పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఇమ్మడిశెట్టిపాలెం పరిధిలోని 82 బూత్‌లో కూడా ఈవీఎంలు మొరాయించాయి. చీరాల మున్సిపాలిటీ పరిధిలోని పోలింగ్ బూత్ 76లో ముందుగా అమర్చిన ఈవీఎం మొరాయించడంతో దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించారు. మార్టూరు మండలం ద్రోణాదుల గ్రామంలోని 38వబూత్‌లో కూడా పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమయింది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్‌బూత్‌లో కూడా పోలింగ్ ఆలస్యంగానే ప్రారంభమవడం గమనార్హం. ఉదయాన్నే బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని పోలింగ్‌బూత్‌లను సందర్శించిన జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా తొలి ఓటు వేశారు.

సౌకర్యాలు కల్పించడంలో విఫలం...

ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన ఓటర్లకు సదుపాయాలు కల్పించడంతో పాటు ఇరుకు గదుల్లో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయడంతో ఆయా కేంద్రాల వద్ద జనం కిక్కిరిసిపోయి నానా అగచాట్లు పడ్డారు. బాపట్ల పట్టణంలోని సీఎస్ నాయుడు ప్రైమరీ హైస్కూల్ ఆవరణలో నాలుగుబూత్‌లు ఏర్పాటు చేశారు. ఆ ఆవరణ చాలా ఇరుకుగా ఉండడం, ఓటర్లు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఓదశలో తోపులాట కూడా జరగడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలో నిల్చున్న ఓటర్లకు కనీసం తాగునీరు అందించే ఏర్పాట్లను కూడా యంత్రాంగం చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఎండవేడి తాళలేక జమ్ములపాలెం గ్రామంలోని పోలింగ్‌బూత్‌లో గంటల తరబడి క్యూలో నిలబడడం వల్ల నర్రా సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు. అక్కడే ఉన్న వైద్య సిబ్బంది అతనికి ప్రాథమికి చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పినట్లైంది. బాపట్ల బేతనీయకాలనీలోని 45వ పోలింగ్‌బూత్‌లో ఓ యువకుడికి పిట్స్ రావడంతో అక్కడే పడిపోయాడు. ఆశా కార్యకర్తలు వైద్యంఅందించడంతో కోలుకున్నాడు

వెల్లివెరిసిన చైతన్యం..విదేశాల నుంచి రాక...

ఓటేయడానికి బారులు తీరినవారిలో యువత అందునా తొలిసారి ఓటు హక్కు వినియోగించుకునే వారు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. ఓటేయడానికి విదేశాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జమ్ములపాలెంకు చెందిన సునీల్, సుమలత దంపతులు కువైట్ నుంచి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఐర్లాండ్, న్యూజిలాండ్, అమెరికా నుంచి కూడా పెద్ద సంఖ్యలో వచ్చిన యువత తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు


ఓటేయడానికి కువైట్ నుంచి వచ్చిన సునీల్, సుమలత దంపతులు


మొరాయించిన ఈవీఎంను పరిశీలిస్తున్న అధికారులు

పోలింగ్ శాతం ఇలా...

పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభంకాగా 9 గంటలకు జిల్లా వ్యాప్తంగా 11.36 శాతం పోలింగ్ నమోదవగా, 11 గంటలకే 26.80 శాతంగా అధికారులు తెలిపారు. 44.45 శాతం పోలింగ్ మధ్యాహ్నం ఒంటి గంటకు జరగ్గా, 3 గంటలకు 59.49 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకు జిల్లా వ్యాప్తంగా 72.14శాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రాత్రి 8 గంటల వరకు కూడా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి ఉండడంతో తుది శాతం వెల్లడికావడానికి సమయం పడుతుందని యంత్రాంగం తెలిపింది

మొరాయించిన ఈవీఎంలు.. ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

● ఇబ్బందులు పడ్డ వృద్ధులు, దివ్యాంగులు

బాపట్ల,మే 13 : బాపట్ల పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలు మొరాయించాయి. దీనివల్ల పోలింగ్ ప్రక్రియ ఆలస్యమైంది. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లోని 60వ పోలింగ్‌బూత్‌లో మాక్ పోలింగ్ అయిపోయిన తర్వాత ఈవీఎం పని చేయకుండా ఆగిపోయింది. దీంతో గంటన్నరకుపైగా ఓటర్లు, వృద్ధులు, దివ్యాంగులు బారులు తీరి నిలిచిపోయారు. కొంతమంది వృద్ధులు కూర్చోవటానికి కుర్చీలు లేక నానా ఇబ్బందులు పడ్డారు. గంటన్నరకు పైగా ఈవీఎం పనిచేయకపోవటంతో పోలింగ్ సిబ్బందిపై, పోలీసులపై ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేయించాలని లేదంటే కొత్త ఈవీఎం తీసుకొచ్చి పోలింగ్ చేయించాలని డిమాండ్ చేశారు. చివరకు టెక్నిషియన్ వచ్చి సరి చేసిన తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. అదేవిధంగా 62వ బూత్‌లో 36 ఓట్లు వేసిన తర్వాత ఈవీఎం మొరాయించింది. బాపట్ల శాఖా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన 63వ పోలింగ్‌బూత్‌లో కూడా గంటసేపు ఈవీఎం పనిచేయలేదు. ఇక్కడ రోడ్డుపై ఓటర్లు ఎండలోనే నిలబడి ఉండాల్సి వచ్చింది. సూర్యలంకరోడ్డులోని సరస్వతీ మోమోరియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయించాయి. ఇమ్మడిశెట్టిపాలెం 82వ పోలింగ్ బూత్‌లో 30 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.బాపట్ల మూర్తి రక్షణ్‌నగర్‌లో, చిల్లగొల్లపాలెంలో స్త్రీ, పురుషులకు ఒకే పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ ఏర్పాటు చేయటం వల్ల మహిళలు ఇబ్బందులు పడ్డారు. బేతనీకాలనీ పోలింగ్‌బూత్ వద్ద ఎండకు తట్టుకోలేక ఇరువురు కళ్ళు తిరిగిపడిపోయారు. వారికి అధికారులుప్రథమ చికిత్స చేశారు.


యాజలిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్

పిట్టలవానిపాలెం మండలంలో...

పిట్టలవానిపాలెం,మే 13 : మండలంలో 14 గ్రామపంచాయతీ పరిధిలోని 34 పోలింగ్ కేంద్రాలలో పురుషులు, మహిళ ఓటర్లు అధిక సంఖ్యలో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద యువత, మహిళలు ఓటు వేసేందుకు బారులు తీరారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చందోలు ఎస్సై అనీల్‌కుమార్ తమ సిబ్బందితో, మహిళా పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహించారు. అల్లూరు పోలింగ్ కేంద్రంలో చిన్నచిన్న గొడవలు జరిగినప్పటికి చందోలు ఎస్సై అక్కడ ప్రశాంత వాతావరణం ఏర్పడే విధంగా తన సిబ్బందితో సమస్యను నివారించారు. బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ తన సిబ్బందితో ఆయా పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పార్టీల నాయకులు సహకరించాలని అన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలను చందోలు ఎస్సై తన సిబ్బందితో కలిసి ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పర్యవేక్షించారు.

కర్లపాలెం మండలంలో...

కర్లపాలెం, మే 13 : కర్లపాలెం మండలంలోని 47పోలింగ్ కేంద్రాలలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో ఓటు వేసేందుకు ఓటర్లు సోమవారం బారులు తీరారు. ఎన్నికలు ఉదయం 7 గంటలకే ప్రారంభించటానికి మండలంలో ఎన్నికల అధికారులందరు శ్రీకారం చుట్టినప్పటికి ఈవీప్యాట్స్ ఆపరేటింగ్‌లు వేగవంతంగా నిర్వహించలేకపోవటం కారణంగా 20 శాతం పోలింగ్ జరగలేదు. మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా గ్రామాలలోని ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు 2 నుంచి 3 గంటలకు పైగా లైన్‌లో వేచియున్నారు. పాతనందాయపాలెంలో మహిళలు ఓటు వేసేందుకు బారులు తీరి ఉండగా నిలుచటానికి కూడా ఖాళీ లేకపోవటంతో పక్కనే కుర్చీలలో కూర్చొని వేచియున్నారు.

ఏట్రవారిపాలెంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య ఘర్షణ

మండలంలోని ఏట్రవారిపాలెంలో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య పోలింగ్ కేంద్రానికి గోవర్దనరెడ్డి వచ్చిన సమయంలో ఘర్షణ జరిగింది. ఘర్షణలో ఇరువురికి తలు పగిలాయి. మండలంలోని పేరలి, ఉర్దూ పాఠశాలల వద్ద జరిగిన ఘర్షణలో నలుగురికి తలపై గాయాలై తీవ్ర రక్తస్రావం జరిగింది. ఏట్రవారిపాలెంలో గొడవ తారస్థాయికి చేరుతున్న క్రమంలో బాపట్ల డీఎస్పీ మురళీ కృష్ణ, రూరల్ సీఐ హజరత్ బాబు అప్రమత్తమై పోలీసు బలగాలను దించి ఘర్షణకు పాల్పడిన చెదరగొట్టారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు, బిఎస్ఎఫ్ బలగాలను మొహరించి శాంతిభద్రతలను పర్యవేక్షించారు. ఉర్దూ పాఠశాల వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు ఘర్షణ జరుగుతుండగా సీఐ హజరతబాబు అప్రమత్తమై పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్ళి ఘర్షణకు పాల్పడివారిని చెదరగొట్టారు. శాంతిభద్రతలను పర్యవేక్షించారు. మండలంలోని యాజలి పోలింగ్ కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్ సందర్శించి ఎన్నికల సరళిని పరిశీలించారు. తహసీల్దార్ నిర్మలానందబాబా మండలంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికలు సక్రమంగా జరిగే విధంగా అవసరమైన చర్యలు చేపట్టారు. గణపవరంలో రెండు ఈవీప్యాట్స్ మొరాయించటంతో రెండింటిని మార్చామని సహ ఎన్నికల అధికారి నిర్మలానందబాబా తెలిపారు. ఎం.విరాజుపాలెం 7.15 వరకు, గణపవరం, నర్రావారిపాలెం 8 గంటల వరకు పోలింగ్ కొనసాగిందని ఎన్నికల అధికారి తెలిపారు.

చుండూరు మండలంలో..


చుండూరు మే 13: మండలంలోని 42 పోలింగ్ బూత్‌లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా సోమవారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్లు కూడా ఒకరోజు ముందుగానే తమ గ్రామాలకు చేరుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. మంచం పట్టిన వృద్ధులు, దివ్యాంగులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద సంఖ్యలో ఓటింగ్ జరలేదని గ్రామస్థులు తెలిపారు. మధ్యాహ్నం ఒక్కసారి వాతావరణం చల్లబడి ఈదురు గాలులు, వర్షం పడింది. అక్కడక్కడా పోలింగ్ కేంద్రాల ప్రాంగణాల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం, వేసిన టెండ్లు పడిపోయాయి. రెండు మూడు గంటల పోలింగ్‌కు అంతరాయం ఏర్పడటంతో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 7.30 గంటల వరకు కూడా ఓటర్లు తమ ఓటును హక్కును వినియోగించుకున్నారు. కూటమి అభ్యర్థి నక్కా ఆనందబాబు మండలంలోని యడ్లపల్లి, వలివేరు, చుండూరు, మోదుకూరు, మండూరు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని పరిశీలించారు.

అమృతలూరు మండలంలో..

అమృతలూరు, మే 13 : మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా ఓటింగ్ పక్రియ సాగింది. 76, 89వ బూత్‌లో ఈవీఎంలు మొరాయించడంతో గంట ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభ మైంది. అమృతలూరులో శతాధిక వృద్ధురాలు వెంకటసుబ్బమ్మ తన ఓటు హక్కు వినియోగించుకుంది. దూరప్రాంతాల్లో నివా సం ఉన్న వారు అధిక సంఖ్యలో వచ్చి తమ ఓటు వేశారు. అమృతలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్ సక్రమంగా లేకపోవడంతో వీల్‌చైర్‌లో తీసుకువచ్చే వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. నక్కా అనందబాబు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు.

బాపట్ల మండలంలో వైసీపీ, టీడీపీ పరస్పర దాడులు

● వైసీపీ కార్యకర్తల దాడిలో టీడీపీ నాయకునికి తీవ్రగాయాలు


తీవ్రగాయాల పాలైన కొండలు

బాపట్ల రూరల్, మే 13 : బాపట్ల మండలంలో సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ కారణంగా బాపట్ల మండలంలోని పలుగ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు పరస్పర దాడులకు దిగారు. బాపట్ల మండలం కంకటపాలెం గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద ఇరుపార్టీల కార్యకర్తలు పరస్పర దాడులకు దిగారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేయటంతో వెళ్ళిపోయారు. పూండ్ల, గోపాపురం గ్రామంలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఇరుపార్టీల కార్యకర్తలు కర్రలతో కొట్టుకున్నారు. అదేవిధంగా బాపట్ల మండలం పడమర పిన్నిబోయనవారిపాలెంలో వైసీపీ కార్యకర్తలు టీడీపీ నాయకులపై దాడులకు దిగటంతో టీడీపీ నాయకుడు నర్రా కొండలు తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే బంధువులు బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నారు.

బలిజేపల్లిలో ఘర్షణ.. ఒకరికి గాయాలు

వేమూరు, మే 13 : మండలంలోని బలిజేపల్లి గ్రామంలో సోమవారం పోలింగ్ అనంతరం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా ఒకరికి గాయాలయ్యాయి. దళితవాడకు చెందిన పోఫూరి సురేష్ అనే వ్యక్తిపై గ్రామానికి చెందిన బుచ్చిబాబు ఘర్షణకు దిగి కులం పేరుతో దూషించాడని, ఈ సందర్భంగా తనను కొట్టడంతో గాయాలయ్యాయి అంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతను ఫిర్యాదు మేరకు పోలీసులు చికిత్స నిమిత్తంగా తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు సురేష్‌ను పంపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

● భారీగా ఓటింగ్‌లో పాల్గొన్న మహిళలు
● మొరాయించిన ఈవీఎంలు ● రెండుగంటల ఆలస్యంగా పోలింగ్


ఉప్పూడిలో ఓ వృద్ధురాలిని ఓటు వేసేందుకు తీసుకువస్తున్న బంధువు


వృద్ధురాలిని ట్రైసైకిల్ ద్వారా తీసుకువస్తున్న మనవడు

రేపల్లె, మే 13 : అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలకు సోమవారం జరిగిన పోలింగ్ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమైనా ఈవీయంలు మొరాయించటంతో పోలింగ్ 10 గంటల వరకు మందకొడిగా సాగింది. నియోజకవర్గంలోని రేపల్లె, నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల్లో ఎన్నికల సరళి ఊపందుకుంది. వృద్ధులు, మహిళలు సైతం ఎండను లెక్కచేయకుండా ఓటు వేసేందుకు బారులు తీరారు. కాగా పోలింగ్ బూత్‌ల వద్ద చలువ పందిళ్ళు ఏర్పాటు చేయకపోవటంతో ఓటర్లు అసహనానికి గురయ్యారు. ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు క్యూలో ఎండతాకిడికి నిలబడలేక సొమ్మసిల్లిపోయి పడిపోయారు. రేపల్లె మండలం కారుమూరు, చాట్రగడ్డ, రేపల్లె పట్టణంలో ఓపెన్ థియేటర్, అయోవా గర్ల్స్ హైస్కూల్‌లో వైసీపీ నాయకులు టీడీపీ నాయకులపై దాడులకు యత్నించారు. ఇరువర్గాలుతోపులాట జరిగింది. నగరం మండలంలో ఈదుపల్లి, చిన్నమట్లపూడి, నిజాంపట్నం మండలం నిజాంపట్నం, పరిశావారిపాలెం, చెరుకుపల్లి మండలం రాంబొట్లవారిపాలెం పంచాయతీలో 262వ బూత్ టీడీపీ కన్వీనర్‌లైన అలుమోరు గోపి, ప్రసాద్‌రెడ్డి టిఫిన్ చేసి బూత్‌ల్లోకి వెళుతుంటే వైసీపీ కార్యకర్తలైన పగడం శివారెడ్డి, ఎ.శ్రీనివాస్‌రెడ్డి, శివనాగిరెడ్డి, కె.దుర్గారెడ్డి, వారి ఇరువురిపై బండరాయితో కొట్టటంతో తలకు భారీగా గాయాలయ్యాయి. గ్రామాల్లో కొంత ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కబెట్టారు. సమస్యాత్మకంగా ఉన్న గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక బలగాలను మొహరించారు. పట్టణంలోని 28 వార్డుల్లో, రేపల్లె రూరల్, నగరం, చెరుకుపల్లి, నిజాంపట్నం మండలాల్లో సాయంత్రం 6గంటలకు పోలింగ్ శాతం 74.14శాతం చేరుకోగా పురుషులు 81,035, మహిళలు 87,431 పోలింగ్ అయ్యాయి. ఇతరులు మూడు ఓట్లు పోలుకాగా మొత్తం 1,68,469ఓట్లు పోలయ్యాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి హేలా షారోన్ తెలిపారు. పోలింగ్ బూత్‌లను ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్, వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు, బూత్‌లను సందర్శించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తును డిఎస్పీ మురళీకృష్ణ నిర్వహించారు.


ఓటు హక్కును వినియోగించుకుంటున్న అనగాని కుటుంబ సభ్యులు

వర్షంతో గంటసేపు పోలింగ్‌కు అంతరాయం

మధ్యాహ్నం 3గంటల సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావటంతో గంటసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో పోలింగ్ సరళి మందకొడిగా సాగగా కొన్నిచోట్ల ఈవీఎంలు విద్యుత్ లేక పోలింగ్ నిలిచిపోయాయి. దీంతో గంటపాటు ఓటర్లు క్యూలైన్‌లో నుంచోవాల్సిన పరిస్థితి నెలకొంది. వేసిన గుడారాలు గాలికి వరిగిపోయి ఉండటంతో ఓటర్లంతా వెనుతిరిగి వెళ్ళిన పరిస్థితి నెలకొంది. విద్యుత్ సరఫరా నెలిచిపోవటంతో సెల్‌ఫోన్ లైట్ల ద్వారానే పోలింగ్‌ను నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు 74.14 శాతం రాగా 1,68,469 ఓట్లు పోలయ్యాయి.

ఓటు హక్కు వినియోగించుకున్న నాయకులు

సిట్టింగ్ ఎమ్మెల్యే, రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసిన అనగాని సత్యప్రసాద్ నిత్యసహాయమాత స్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ గుళ్ళపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణరావు నిజాంపట్నంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి మోపిదేవి శ్రీనివాసరావు రేపల్లె అయోవా బాలికల హైస్కూల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేసన శంకరరావు బొర్రావారిపాలెంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.


మొరాయించిన ఈవీఎంలు..

నియోజకవర్గంలోని రేపల్లె మండలం అరవపల్లి గ్రామంలో ఎన్నికల బూత్‌లో రెండు ఈవీఎంలు మొరాయించాయి. అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు నిర్వహించి ఒక కొత్త ఈవీఎం మిషన్‌ను తీసుకుని వచ్చారు. రేపల్లె మండలం పేటేరు గ్రామంలో ఈవీఎంలు తొలుత కొంత మొరాయించాయి. నిజాంపట్నం మండలం పరిశావారిపాలెం, నిజాంపట్నం, గోకర్ణమఠంలో ఈవీఎంలు కొంతసేపు మొరాయించాయి. చెరుకుపల్లి మండలం బొలుసులపాలెం గూడవల్లి, గుళ్ళపల్లి, రాజవోలులో గంటకు పైనే ఈవీఎంలు మొరాయించాయి. ఓటర్లు అసహనానికి గురయ్యారు. నగరం మండలం ఈదుపల్లి, వెనిగళ్ళవారిపాలెం, మంత్రిపాలెం, సజ్జావారిపాలెం, పెద్దవరం, గ్రామాల్లో ఈవీఎంలు అరగంటకు పైనే మొరాయించారు. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవటంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది.

కదిలివచ్చిన మహిళా ఓటర్లు..

ఎన్నికల పోలింగ్ ప్రారంభమైనప్పటి నుంచి నియోజకవర్గంలోని అన్ని బూత్‌లలో పురుషుల కంటే మహిళలే ఉత్సాహంగా ఓటు వేసేందుకు భారీగా బారులు తీరారు. ఏ బూత్‌లో చూసినా మహిళలే అధికంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. పోలింగ్ ప్రారంభం నుంచే మహిళలు ఓట్లు వేసేందుకు ఉత్సాహంగా పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు 74.14 ఓట్ల శాతం రాగా పురుషులు 81,035 ఓట్లు పోలయ్యాయి. మహిళలు 87,431 ఓట్లు పోలయ్యాయి. 6394 మహిళలు అత్యధికంగా ఓట్లు వేశారు.

రిసెప్షన్ సెంటర్‌లను పరిశీలించిన కలెక్టర్


ఈవీఎంల భద్రతను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

బాపట్ల,మే 13 : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళసింగ్‌లు సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాలు నుంచి తీసుకొచ్చే ఈవీఎం యంత్రాలను స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచేందుకు రిసెప్షన్ సెంటర్‌లలో అప్పగించాల్సి ఉంటుంది కావున తగిన ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్‌గా రాజీనామా చేయకపోతే నీ అంతుచూస్తా

బాపట్లరూరల్, మే 13 : భర్తీపూడి సర్పంచ్ అచంట అమరేష్‌పై సోమవారం పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ సందర్భంగా అమరేష్ మాట్లాడుతూ తనను సర్పంచ్ పదవీ నుండి రాజీనామా చేయకపోతే నీ అంతుచూస్తాం అని అంటూ గొడవకు దిగి వైసీపీ కార్యకర్తలు పులి శివనాగరాజు, పులి శ్రీనివాసరావు, ఎం.రాజశేఖర్‌తో పాటు మరో ఆరుగురు కలిసి దాడి చేశారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వటం జరిగిందని తెలిపారు.





పర్చూరులో బారులు తీరిన ఓటర్లు.. ఉప్పుటూరులో వాన కురుస్తున్నా వేచి ఉన్న ఓటర్లు.. బల్లికురవలో ఓటేసేందుకు నిల్చున్న మహిళలు

ఓటోత్సాహం

- భారీ సంఖ్యలో హాజరైన మహిళలు
- మండుటెండను లెక్కచేయని ఓటర్లు
- పర్చూరులో వాన కురుస్తున్నా వెనక్కి వెళ్లని వైనం
- ఉదయం మండుటెండ.. సాయంత్రం భారీ వర్షం
- బెంబేలెత్తిన ఓటర్లు... పోలింగ్‌లో విచిత్ర పరిస్థితి
- సౌకర్యాల కల్పనలో విఫలమైన అధికారులు
- పలుచోట్ల వైసీపీ దౌర్జన్యాలు.. చోద్యం చూసిన పోలీసులు

అద్దంకి, మే 13 : అద్దంకి ప్రాంతంలో పోలింగ్ రోజు విచిత్ర పరిస్థితి ఏర్పడింది. సోమవారం ఉదయం ఎండ మండి పోగా.. సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ ప్రభావం ఓటింగ్‌పై కొంత మేర కనిపించినా భారీ ఓటింగ్ నమోదైంది. అద్దంకి పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా అత్యధిక శాతం పోలింగ్ కేంద్రాలలో ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలోని ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్, మండలంలోని శ్రీనివాసనగర్, సంతమాగులూరు మండలంలోని పరిటాలవారిపాలెం తదితర పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. అద్దంకి పట్టణంలోని అత్యధిక పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయమే ఓటర్లు బారులు తీరగా, సరిపడా టెంట్‌లు లేక ఎండలోనే గంటల తరబడి నిల్చున్నారు. ఓటర్ల నుంచి తీవ్ర విమర్శలు రావడంతో అధికారులు ఆలస్యంగా మేల్కొని టెంట్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ ఎన్టీఆర్‌నగర్ ప్రాథమిక పాఠశాల, కాకానిపాలెం ప్రాథమిక పాఠశాల, ఎల్ ఆర్ ఎ యిడెడ్ పాఠశాల తదితర పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఎండలోనే బారులు తీరారు. మధ్యాహ్నాంకు ఎండ వేడిమితో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తగ్గారు. 2గంటల సమయానికి భారీ వర్షం కురవడంతో సుమారు గంట పాటు పోలింగ్‌కు ఓటర్లు వచ్చేందుకు ఇబ్బంది పడ్డారు. ఎల్ ఆర్ ఎయిడెడ్ పాఠశాల వద్ద చిన్న ప్రాంగణంలోనే 3 పోలింగ్‌బూత్‌లను ఏర్పాటు చేయడంతో మరింత ఇరుకుగా మారింది. వర్షం నీరు బయటకు వెళ్లే మార్గం లేక నిలిచి పోవడంతో ఓటర్లు వర్షపు నీటి లోనే బారులు తీరి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం ఎండ వేడిమితో వెను దిరిగివెళ్లిన ఓటర్లు సాయంత్రం వర్షం తగ్గిన తరువాత పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. దీంతో ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్, కాకానిపాలెం ప్రాథమిక పాఠశాలల, రామకృష్ణాపురం ప్రాథమిక పాఠశాలల వద్ద పోలింగ్ బూత్‌లవద్ద రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.

పోటెత్తిన ఓటర్లు

- పలు గ్రామాలలో ఉదయం నుంచే బారులు
- వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వేచి ఉన్న వైనం

పర్చూరు : పర్చూరు నియోజకవర్గంలో ఓటర్లు పోటెత్తారు. పోలింగ్ సమయానికి ముందే అయా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు క్యూలో బారులు తీరారు. వివిధ ప్రాంతాలలో పర్చూరుకు చెందిన ఓటర్లు తమ సొంత నియోజకవర్గంలో ఓటు వేసేందుకు గ్రామాలకు చేరుకోన్నారు. దీంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకుంది. ఉదయం 7 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు చురుకొని ఓటు వేసేందుకు పోటీ పడ్డారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద సంఖ్యలో మండలంలోని అయా గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్ద సంఖ్యలో ఓటర్లు చేరుకోవడం ఇందుకు నిదర్శనం. వృద్ధులు, దివ్యాంగులు, నూతంగా ఓటు హక్కు పొందిన యువకులు తమ ఓటు హక్కును వినియెగించుకోవడానికి ఆసక్తి చూపారు. ఒక పక్క మండు టెండ, మరో పక్క ఉక్క పోతను కూడా లెక్క చేయకుండా పోలింగ్ కేంద్రాలను తరలివచ్చి, గంటల తరబడి కేంద్రాల వద్ద క్యూలో నిరీక్షించారు. దీంతో పోలింగ్ శాతం గతం కంటే గణనీయంగా పెరిగింది. మండలంలోని దేవరపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతో కొంతసేపు ఓటింగ్‌కు అంతరాయం ఏర్పడింది. తిరిగి అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. అయితే అయా గ్రామాలలో స్వల్ప వివాదాలు మినహా పోలింగ్ ప్రశాంతంగానే ముగిసింది. అయితే పోలింగ్ కేంద్రాలు ఇరుకుగా ఉండడం సరైన వసతుల లేకపోవడంతో కొన్ని కేంద్రాలలో ఓటర్లు తీవ్ర అవస్థకు గురయ్యారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైన ఓటు హక్కు వినియెగించుకోవాలన్న పట్టుదలతో కేంద్రాల వద్దే వేచి ఉన్నారు.

జోరు వానలో ఓటరు జోరు

పర్చూరులో సోమవారం మధ్యాహ్నాం 2 గంటల ప్రాంతంలో వడగళ్లు, గాలి దుమారం, భారీ వర్షం కురవడంతో అయా పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితి చిత్తడిగా మారింది. ఒక పక్క కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్లు పడిపోవడం మరో పక్క భారీ వర్షంతో పోలింగ్ కేంద్రాల వద్ద నీరు చేరడంతో అనీటిలోనే గంటల తరబడి నిల్చొని మరి ప్రజలు ఓటు హక్కును వినియెగించుకున్నారు.

కిక్కిరిసిన పోలింగ్ కేంద్రాలు.. ఓటర్లకు అవస్థలు

పర్చూరులోని ఇందిర కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం ఓటర్లను ఉక్కిరి బిక్కిరి చేసింది. కేంద్రాల పరిమితికి మించి ఓటర్లు ఉండడం ఒక్క సారిగా పెద్ద సంఖ్యలో ఓటు వేసేందుకు చంటి బిడ్డలతో సహాతరలి రావడంతో ఓటర్లు నానా అవస్థలు పడ్డారు. కేంద్రంలో సరైన వెలుతురు గానీ గాలిగానీ లేకపోవడంతో ఓటర్ల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. దీంతో ఒక్క సారిగా ఓటు వేసేందుకు గుంపులుగా రావడంతో వారిని అదుపు చేయడానికి పోలీసులు పడరాని పాట్లు పడ్డారు. మరో పక్క పోలీసు సిబ్బంది కూడా అరకొరగా ఉండడంతో ఏమి చేయాలో పాలుపోక పోలీసులు సైతం చేతులేత్తేశారు. దీంతో అ పోలింగ్ కేంద్రం వద్ద కొంత గందర గోల పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో సీఐ సీహెచ్ సీతారామయ్య పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకొని సమస్యను ఓటింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపట్టారు.



అద్దంకి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని బారులు తీరిన ఓటర్లు

బారులు తీరిన ఓటర్లు

మార్టూరు, మే 13 : అసెంబ్లీ ఎన్నికలు పోలింగ్‌కు ఓటర్లు ఉత్సాహంతో పోటెత్తారు. సోమవారం పోలింగ్ కేంద్రాలకు ఉదయం 7 గంటలకే తరలి వచ్చారు. ముఖ్యంగా మహిళలు ఉత్సాహంగా ఓటు వేసేందుకు ఆ సక్తిగా కేంద్రాల వద్దకు వచ్చారు. మార్టూరులో ఉన్న 19 పోలింగ్ బూత్‌ల వద్దకు ఉదయం 8 గంటలకే ఓటర్లు బారులుతీరారు. మండలంలో 72 పోలింగ్ బూత్ ల వద్దకూడా ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలిసింది. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో 38వ బూత్‌లో ఈవీఎం మెషీన్ సక్రమంగా పని చేయకపోవడంతో దాదాపుగా గంటకు పైగా ఆ ల స్యంతో ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అదే విధంగా సాయంత్రం 2 గంటలకు కోలలపూడిలోని 66వ బూత్‌లో ఈవీఎం ఆగిపోయింది. మరో ఈవీఎంను పర్చూరు నుం చి తెప్పించారు. సుమారు గంటపాటు పోలింగ్ నిలిచిపోయింది. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఉదయం బూత్‌ల రద్దీ ఉండడంతో ఓటే వేసేందుకు వచ్చిన వృద్ధులు 2గంటలకు పైగా నిరీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది చాలా తక్కువగా ఉండడంతో జడ్పీ హైస్కల్ వద్ద ఓటు వేసేందుకు వచ్చిన వారి కన్నా ఇతరులు ఎక్కువగా గుమిగూడారు. సాయంత్రం 6 గంటలు ముగిసిన తర్వాత కూడా మార్టూరు లోని 27వ బూత్‌లో, ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద ఉన్న బూత్‌లో, ద్రోణాదుల, బొబ్బేపల్లి, ద్వారకపాడు కోనంకి గ్రామాలలో కొన్ని బూత్‌ల వద్ద ఓటర్లు ఓటు కోసం క్యూలో నిలబడ్డారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఆల స్యంగా ఓట్లు నమోదు కావడం, ఎక్కువ ఓట్లు ఉండడంతో ఆలస్యం అయినట్లు అధికారులు తెలిపారు.

కోనంకిలో ఘర్షణ

మండలంలోని కోనంకి గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య సోమవారం మధ్యాహ్నాం కొంత ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వాస్తవంగా ఉదయం 10 గంటల సమయంలోనే రెండు పార్టీలకు చెందిన వారి మధ్య తోపులాట జరగ్గా విషయం తెలుసుకున్న స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో వచ్చి వారిపై లాఠీచార్జి చేసి చెల్లా చెదురు చేశారు. తర్వాత మళ్లీ గొడవ జరగడంతో వరదయ్య, శేషగిరి రావు, గురవయ్య అనే వ్యక్తులు గాయపడినట్లు తెలిసింది. అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్ బెటాలియన్‌తో అక్కడకు చేరుకోవడంతో గొడవ సద్దుమణిగింది. వారిలో వరదయ్యను చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, మిగిలిన ఇద్దరినీ మార్టూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం సాయంత్రం 4 గంటల సమయంలో పోలీస్ అబ్జర్వర్ ఎంఏ అయ్యప్పన్ కోనంకి గ్రామం వచ్చి గొడవ జరిగిన తీరును పరిశీలించి పోలీసు సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇక మండలంలో వలపర్ల, ద్రోణాదుల, చిమ్మిరి బండ గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద రెండు పార్టీలకు చెందిన వ్యక్తుల మధ్య తోపులాట జరిగినట్లు తెలిసింది. ఈ కేంద్రాల వద్ద పోలీసు సిబ్బంది స్పందించడంతో పరిస్థితి ప్రశాంతంగా ముగిసింది.

చెదురుమదురు ఘటనల మధ్య..

- ఓట్లు వేసేందుకు ఆసక్తి చూపిన ఓటర్లు
- నక్కబొక్కలపాడులో వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి, నేతలు వెళ్లారని టీడీపీ కార్యకర్తల ఆగ్రహం

బల్లికురవ : మండలంలోని 56 పోలింగ్ బూత్‌లలో సోమవారం సార్వత్రిక ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ చెదురు మదురు ఘటనల మధ్య ప్రశాంతంగా జరిగింది. ఓట్లు వేసేందుకు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలకు యువత కూడా ఉదయం ఆరు గంటల నుంచే బారులు తీరారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో ఉండే గ్రామిణా ఓటర్లు ఓట్లు వేసేందుకు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. కొన్ని గ్రామాలలో ఈవీఎంలు మంద కొడిగా పనిచేయడంతో పోలింగ్ ప్రక్రియ కొంత ఆలస్యం అయింది. మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఓటర్లు ఓట్లు వేసేందుకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఈవీఎంలు సరిగ్గా పనిచేయక పోవడంతో అక్కడి ఓటర్లు సీ-విజిల్ కంట్రోల్ రూంకు ఫిర్యాదు చేశారు. కొన్ని గ్రామాలలో ఓటర్లకు సరైన సౌకర్యాలు లేక పోవడంతో ఎండలోనే నిలబడి ఓట్లు వేశారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, వైదన, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం కొత్తపాలెం, కొండాయపాలెం గ్రామాలలో ఓటింగ్ సమయంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య స్వల్ప ఘర్షణలు, వాదనలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ మాత్రం ప్రశాంతంగా జరిగింది. ఓటింగ్ మాత్రం ప్రశాంతంగా జరిగింది. పలు రూట్లలో పోలిసు అధికారులు ప్రత్యేక మెబైల్ టీంలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయడంతో ఓటింగ్ సజావుగా సాగింది. మండలంలోని కొండాయపాలెం గ్రామంలో పోలింగ్ ముగిశాక వైసీపీ, టీడీపీ నేతల మధ్య కొట్లాట జరగడంతో ఇరువర్గాల వారికి స్వల్ప గాయాలయ్యాయి. అలానే నక్కబొక్కపాడు గ్రామంలో వైసీపీ అభ్యర్థి హనిమిరెడ్డి పోలింగ్ బూత్ పరిశీలనకు లోపలికి వెళ్లగా అయనేతో వైసీపీ నేతలు వెళ్లారని టీడీపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కేకలు వేయడంతో పోలీసులు వెంటనే వచ్చి లోపల ఉన్న వారిని బయటకు తీసుకు రావడంతో వివాదం సద్దు మణిగింది. పంచాయతీల ఎన్నికలను తలపించేలా కొన్ని గ్రామాలలో ఎంతో పట్టుదలగా ప్రజలు ఓట్లు వేశారు. కొన్ని గ్రామాలలో 95 శాతం పైబడి పోల్ జరిగినట్లు అంచనా. గ్రామాలలో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ జరిగింది.

యద్దనపూడి మండలంలో ప్రశాంతం

యద్దనపూడి, (మార్టూరు) : ఎన్నికలలో యద్దనపూడి మండలంలోని ప్రజలు ప్రశాంతంగా తమ ఓటు హక్కును విని యోగించుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ప్రజలతోపాటు పోలీసులు, ఇరు పార్టీల నాయకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం మండలంలోని చింత పల్లిపాడు గ్రామం వద్ద తెలుగుదేశం కూటమి ర్యాలీగా వెళ్లే బైక్ ర్యాలీ కార్యకర్తలకు, ఎంపీ నందిగం సురేష్ కు మధ్య కొంత వివాదం జరిగిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు ముందు చూపుగా చింతపల్లిపాడు, యనమదల గ్రామాలలోని పోలింగ్ బూత్‌ల వద్ద ప్రత్యేకంగా బందోబస్తుగా స్పెషల్ బెటాలియన్లు పోలీసులను మోహరించడంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలో 28 పోలింగ్ బూత్‌లున్నాయి. వాటిలో ఉదయం తనుబొద్ది వారిపాలెంలో 91 వ బూత్, మున్నంగి వారి పాలెంలో 97వ బూత్‌లో ఈవీఎం మిషన్లు గంట సేపు పని చేయక పోవడంతో తర్వాత ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గతంలో ఎన్నడూ లేని విధంగా గన్నవరం గ్రామంలో 94 శాతం పోలింగ్ నమోదు కావడం విశేషంకాగా ఈ గ్రామంలో టీడీపీ కూటమికి మంచి మెజార్టీ వచ్చే అవకాశాలున్నాయి. అనంతవరం, యద్దనపూడి, పోలూరు, చింత పల్లిపాడు, యనమదల తదితర గ్రామాలలో పోలింగ్ సరళి పట్ల టీడీపీ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. అయితే యద్దనపూడి ఎస్సీ కాలనీలో 84వ బూత్, 7 గంటల తర్వాత కూడా 150 మంది ఓటర్లు ఓటు వేసేందుకు క్యూలో నిలబడినట్లు తెలిసింది.

ముగిసిన పోలింగ్

చినగంజాం : ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు బారులుతీరారు. మహిళలు, యువకులు, వృద్ధులు అధిక సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పెదగంజాం 290, నీలాయపాలెం 289, సోపిరాల 272 పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మరమ్మతులకు గురికావడంతో అర్ధగంటకు పైగా పోలింగ్ నిలిచిపోయింది. రామచంద్రానగర్ 8.40 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.40కి ముగిసింది. చినగంజాం జడ్పీ పాఠశాలలలో టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశివరావు, కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని రామచంద్రానగర్, పెద్దపల్లెపాలెం గ్రామాల్లో టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి టి.కృష్ణప్రసాద్ పోలింగ్ తీరును పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్ల బార్లు తీరారు. సంతరవూరులో రాత్రి 7.45గంటలకు పోలింగ్ ముగిసింది. కడవకుదురు, పెద్దపల్లెపాలెం, పెదగంజాం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉండడంతో రాత్రి 8.00 గంటల వరకు పోలింగ్ సాగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగక పోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

పంగులూరు : పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎండను కూడా లెక్క చేయకుండా ఆరికట్లవారిపాలెం, జనకవరం, చందలూరు, కోటపాడు గ్రామాలలో ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 6 గంటలకు ముగిసినప్పటికీ వందల సంఖ్యలో ఓటర్లు ఉండడంతో ఫ్లడ్ లైట్ల వెలుగులో కొనసా గించారు. ఎమ్మెల్యే రవికుమార్ చందలూరు లో పోలింగ్ సరళిని పరిశీ లించారు.

సంతమాగులూరులో ప్రశాంతం

సంతమాగులూరు : మండలంలోని అన్ని గ్రామాలల్లో చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతగా పోలింగ్ జరిగింది. మండలంలోని కుందుర్రు గ్రామంలో సాయంత్ర 5 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు ఓటర్లు క్యూలైన్‌లలో బారులు తీరారు. మండలంలోని సంతమాగులూరు, పాతమాగులూరు, మిన్నెకల్లు, తంగేడుమల్లి, చవిటిపాలెం, గురిజేపల్లి, బండివారిపాలెం, కొప్పరం, సజ్జాపురం, కొమ్మాలపాడు, ఏల్చూరు, మక్కెనవారిపాలెం, మామిళ్లపల్లి, పరిటాలవారిపాలెం, పుట్టావారిపాలెం, కామేపల్లి, వెల్లలచెరువు, అడవిపాలెం తదితర గ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.



పూసపాడులో గుంపులుగుంపులుగా ఉన్న ఓటర్లు

ఓటర్లకు తిప్పలు

పలు కేంద్రాల వద్ద వసతులు కరువు

ఇంకొల్లు, మే 13 : పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పావులూరులో మండుటెండలో సైతం మహిళలు వేచి ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూసపాడు గ్రామంలో చిన్న బిల్డింగ్‌లో రెండు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఓటర్లు రద్దీ పెరిగి ఓటు వేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంపులు గుంపులుగా నిలబడి ఓట్లు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గంగవరంలో 246 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించి పోలింగ్ సుమారు గంటకుపైగా నిలిచిపోయింది. ఈవీఎంలు నెమ్మదిగా పని చేయడంతో ఓటర్లు క్యూ లైన్లలో గంటల కొద్దీ వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంకొల్లు మండలంలో మొత్తం 13 గ్రామపంచాయతీలలో 54 పోలింగ్ కేంద్రాలలో ప్రజలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. నాగండ్ల, నక్కలపాలెం, గంగవరం గ్రామాలలో చిన్న చిన్న వివాదాలు జరిగినప్పటికీ ప్రశాంతంగా పోలింగ్ జరిగింది.ఇంకొల్లు మండలంలో 85 శాతానికిపైగా పోలింగ్ జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు తెలిపారు. ఇంకొల్లు స్టాలిన్‌పేటలో రాత్రి 7 గంటల వరకు కూడా ఓట్లు వేసేవారు బారులు తీరి ఉన్నారు. సుమారు 150 మందికి పైగా ఓటు వేయాల్సిన వారు క్యూలో ఉన్నారు. స్టాలిన్‌పేట ఈ బూత్‌లో మొత్తం 1050 ఓట్లుకు గాను రాత్రి 7 గంటల వరకు సుమారు 800 మంది మాత్రమే ఓటు వేశారు. 150 క్యూలో ఉన్నారు. రాత్రి 9 గంటల వరకు పట్టవచ్చునని అధికారులు తెలిపారు.

ఇసుకదర్శిలో ఓటేసిన ఏలూరి



కుమారుడితో కలిసి ఓటేసిన ఏలూరి

మార్టూరు, మే 13 : టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఏలూరి సాంబశి వరావు తనకుమారుడు దివ్యేష్‌తో కలిసి సోమవారం ఉదయం మండలంలోని ఇసుకదర్శిలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మండలంలోని ఇసుక దర్శి ఏలూరి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి కుమారునితో కలిసి 44వ బూత్‌లో తమ ఓటును వేశారు. అనంతరం గ్రామంలోని పో లింగ్ బూత్‌ల వద్దకు వెళ్లి పోలింగ్ తీరును పరిశీలించారు. తర్వాత మార్టూరులో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ఉన్న పోలింగ్ బూత్‌లను, జడ్పీ హైస్కూల్‌లో ఉన్న పోలింగ్ బూత్‌లను సందర్శిం చారు. అనంతరం డేగరమూడి గ్రామంలో పోలింగ్ సరళిని, తర్వాత యద్దనపూడి మండలం చింతపల్లిపాడు, యనమదల, యద్దనపూడి, జాగర్ల మూడి గ్రామాలలో పోలింగ్ కేం ద్రాలకు వెళ్లి పోలింగ్ తీరును పరిశీలించారు. ఆ యా కేంద్రాలలో ఓటర్లకు నమస్కారం పెడుతూ చిరునవ్వుతూ ముందుకు వెళ్లిపోయారు. అయితే ఉదయం సమయానికే మహిళలు పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు రావడంతో ఏలూరి సంతోషం వ్యక్తం చేశారు.

వడగళ్లతో భారీ వర్షం

- జలమయమైన రహదారులు
- అవస్థలు పడిన ప్రజలు



మధ్యాహ్నాం భారీగా కురిసిన వాన

పర్చూరు, మే 13 : గాలి దుమారం, మరో పక్క భారీ వర్షంతో ప్రజలు బెంబేలెత్తారు. సోమవారం ఒక్క సారిగా భారీ వర్షంతో పాటు వడగళ్ల వాన కురిసింది. కుండపోతతో కూడి వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. శివారు కాలనీల్లోని నివాసాల్లోకి వాన నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మరో పక్క సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లు సైతం గాలికి చెల్లా చెదురయ్యాయి. దీంతో ఎన్నికల సిబ్బందితోపాటు, ఓటు వేసేందుకు కేంద్రాల వద్దకు వెళ్లిన ఓటర్లు ఆందోళనకు గురయ్యారు. పర్చూరు - చీరాల ఆర్అండ్‌బీ రోడ్డులో పెద్ద ఎత్తున వర్షపు నీరు చేరడంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు.. సరఫరా నిలిపివేత

గాలిదుమారంతో పెద్దపెద్ద చెట్లు కూలి విద్యుత్ స్తంభాలపై పడిపోవడంతో విద్యుత్ వైర్లు తెగిపడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామాలు అందకారం నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అయితే విద్యుత్ శాఖ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మండే ఎండ.. ఉక్కపోతతో.. ఇబ్బందిపడ్డ ఓటర్లు



గొల్లపాలెంలో ఎండలో ఉన్న ఓటర్లు

చీరాల, మే 13 : ఎన్నికల వేళ మండే ఎండ ఓటర్లును ఇబ్బంది పెట్టింది. సోమవారం సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా కొన్ని కేంద్రాలలో ఇవీఎంలను మాక్ పోలింగ్‌కు సమాయత్తం చేయటంలో కొంత జాప్యం జరిగింది. ఆ తరువాత పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయ్యింది. నియోజకవర్గ పరిధిలో మొత్తం 2, 02, 711 ఓట్లు ఉన్నాయి. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 218 బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ నేపథ్యంలో పట్టణ, రూరల్ ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు, వాటి సమీపంలో తప్ప ఇతర ప్రాంతాల్లో జనసంచారం తక్కువగా ఉంది. దుకాణాలు మూతపడి, జనసంచారం తగ్గటంతో ప్రధాన రహదారులు బోసిపోయాయి. పలు బూత్‌లలో మొదటిసారిగా ఓటు పొంది వినియోగించుకునేందుకు వచ్చిన యువత ఉత్సాహంగా పోలింగ్‌లో పాల్గొన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు సైతం గతంతో పోలిస్తే ఎక్కువ మంది వచ్చినట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి సౌకర్యం నామ మాత్రమేనని కొన్ని కేంద్రాల వద్ద ఓటర్లు ఆరోపించారు. ప్రతి కేంద్రం వద్ద హెల్త్ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అందులో పోలింగ్ వచ్చినవారిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తీసుకున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాన్నం 1.30 గంటల వరకు ఎండవేడిమి, ఉక్కపోతతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. మధ్యాన్నం 2 గంటల నుంచి పైరగాలి తోలటంతో అప్పటి నుంచి పోలింగ్‌కు వచ్చిన ఓటర్లు ఒకింత ఊపిరిపీల్చుకున్నారు.

పెదనక్కలపాలెంలో ఘటన

- ఎంపీ అనుచరుడి హల్‌చల్
- ఓటర్లతో వాగ్వివాదం.. ఒకరికి గాయం.. ఫిర్యాదు



సాయికిరణ్ చేతికి తగిలిన గాయం

ఇంకొల్లు, మే 13 : మండలం పెదనక్కలపాలెం పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ నందిగామ సురేష్ అనుచరిడినని ఒకరు హల్‌చల్ చేశారు. పావులూరు గ్రామానికి చెందిన కే వినోద్ పెదనక్కలపాలెంలో కేంద్రం వద్ద వీడియోలు తీస్తుండగా, గ్రామస్థులకు అనుమానం వచ్చి వినోద్‌ను ప్రశ్నించగా తాను ఎంపీ అనుచరుడినని చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి తల్లపనేని సాయికిరణ్ చేతికి గాయాలైనట్లు టీడీపీ నాయకులు తెలిపారు. ఇరువర్గాలు ఇంకొల్లు పోలీసుస్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరావు తెలిపారు.





భవానీ సెంటర్‌లో రామయ్య పంతులు బడిలో వర్షపు నీటిలో నిల్చొని ఉన్న మహిళలు.. సంతమాగులూరులో క్యూలో ఉన్న ఓటర్లు.. మార్టూరులో మండుటెండలో బారులు తీరిన ఓటర్లు

ఓటు హక్కును వినియోగించుకున్న అభ్యర్థులు



ఓటు వేస్తున్న కొండయ్య

చీరాల, మే 13 : సార్వత్రిక ఎన్నికలలో సోమవారం పోటీలో నిలుచున్న అభ్యర్థులు వారి, వారి ఓటు ఉన్న పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రామకృష్ణాపురం పోలింగ్ బూత్‌లో ఎమ్మెల్యే కరణం బలరాం తన ఓటును వేశారు. కొత్తపేట పోలింగ్ కేంద్రంలో టీడీపీ కూటమి అభ్యర్థి ఎం.ఎం కొండయ్య తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి కరణం వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్, 12 మంది స్వతంత్ర అభ్యర్థులు వారి ఓట్లు ఉన్న పోలింగ్ బూత్‌లలో వారి, వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

చీరాలలో పోలింగ్ సాగిందిలా

చీరాల, మే 13 : చీరాల నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,02,711 మంది ఉన్నారు. 9.30 గంటలకు 82 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రక్రియ ప్రారంభమయింది. ఉదయం కొన్ని కేంద్రాలలో ఈవీఎంల ప్రారంభ ప్రక్రియ ఒకింత జాప్యం జరిగింది. దీంతో మొదటి రెండు గంటల వ్యవధిలో 11.08 శాతం మాత్రమే పోలయ్యాయి. తరువాత ఎండ వేడిమి, ఉక్కపోతతో పోలింగ్ కేంద్రాలకు వచ్చే వారి సంఖ్య తగ్గింది. ఈ క్రయంలో సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య పోలింగ్ కేంద్రాలకు ఓటు వేసేందుకు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో 6 గంటలలోపు పోలింగ్ కేంద్రాల క్యూలో ఉన్న ఓటర్లకు సంబంధించి కొన్ని కేంద్రాలలో పోలింగ్ రాత్రి 11 గంటల వరకు కొనసాగింది.

మంచి అభ్యర్థిని ఎన్నుకోవడంలో అద్దంకి ప్రజలు ముందుంటారు

- గతంలో అత్యధిక ఓటింగ్
- ఈసారి 90శాతం
- టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొట్టిపాటి

అద్దంకి, మే 13 : అద్దంకి నియోజకవర్గ ప్రజలు మంచి అభ్యర్థిని ఎన్నుకోవడంలో ముందుంటారని టీడీపీ కూటమి అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి పట్టణంలోని భవానీసెంటర్‌లో ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్‌లో సోమవారం మధ్యా హ్నాం గొట్టిపాటి ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత రెండు సార్వత్రిక ఎన్నికలలో అద్దంకి నియోజకవర్గ ఓటర్లు మంచి అభ్యర్థిని ఎన్నుకున్నారు. రెండు సార్లు అత్యధిక ఓటింగ్ శాతం నమోదయిందన్నారు. ఈ విడత కూడా 90 శాతం ఓటు హక్కును వినియోగించుకుని ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను ఎన్నుకుంటారని భావిస్తున్నానని అన్నారు. గొట్టిపాటి కు టుంబ సభ్యులు కూడా అనంతరం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పంగులూరులో మాజీ ఎమ్మెల్యే, టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య, శాప్‌నెట్ మాజీ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య ఓటు హక్కు వినియోగించుకున్నారు.



ఎల్‌ఆర్ ఎయిడెడ్ స్కూల్‌లో ఓటును వేస్తున్న ఎమ్మెల్యే గొట్టిపాటి

ఓటర్లకు గొట్టిపాటి కృతజ్ఞతలు

అద్దంకి నియోజకవర్గంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు అందరికీ టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సోమవారం ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. తన గెలుపు కోసం ఓటు వేసిన నియోజకవర్గ ప్రజలకు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలకు, మహిళలకు రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.